# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

తెలంగాణ | సంపుటి : 2 | సంచిక : 250 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | మంగళవారం 2 డిసెంబర్ 2025




## వారికి ఐపీఎస్ హెూదా ఎందుకు కల్పించారు?

- రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హైకోర్టు షాక్
- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు
- శిఖా గోయల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్రలను ఐఏఎస్ కేడర్‌లో కొనసాగించడంపై ఆగ్రహం
- డిసెంబర్ 10 లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు షాక్ ఇచ్చింది. పలువురు ఐపీఎస్ అధికారులను ఐఏఎస్ కేడర్‌లోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. శిఖా గోయల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర వంటి ఐపీఎస్ అధికారులను ఐఏఎస్ కేడర్‌లో ఎందుకు కొనసాగిస్తున్నారో వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు - మిగతా3లో

# విద్యాభివృద్ధి ముఖ్యం

### కేటీఆర్ అండ్ కో రెచ్చగొడుతున్నారు
### సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్



- ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తుంది
- పాలమూరు జిల్లా విద్యాపరంగా రాష్ట్రానికి మోడల్‌గా ఉండాలి
- సన్నబియ్యం, ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్సు అన్నీ అమలు చేస్తున్నాం
- ఇది చాలదన్నట్లు మా ఆడబిడ్డలు పెట్రోల్ బంకులు, వెయ్యి బస్సులకు యజమానులు అయ్యారు.
- లంచం అడిగితే వీపు విమానం మోత మోగించండి
- మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానిది.. సన్నబియ్యం ఇస్తున్నాం
- బీసీల జనాభా 56 శాతం ఉన్న లెక్క తేల్చిన ఘనత మాది

నారాయణపేట

మక్తల్ నియోజకవర్గాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తమ హయాంలో మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు రేవంత్. మక్తల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ' కొడంగల్ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తాం. భూములిచ్చిన రైతులకు రూ 20 లక్షల పరిహారం ఇస్తున్నాం. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తి చేయాలి. దండు కట్టండి.. దగ్గరుండి పనిచేయించుకోండి. ఎవరైనా లంచం అడిగితే వీపు విమానం మోత మోగించండి. ఇరిగేషన్‌తో పాటు విద్యకూ ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రతీ పేదబిడ్డకు చదువు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించాం. ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పించాం. పక్కనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్న - మిగతా3లో



## ఇక్కడ డ్రామాలొద్దు


- బాధ నుంచి బయటకు రండి
- ప్రతిపక్షాలకు ప్రధాని కీలక సూచన
- వికసిత్ భారత్ లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నాం
- తమ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమే
- ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి
- చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి



## ప్రాణాలు పోతుంటే చర్యలు తీసుకోరా?

- గాలి నాణ్యత కారణంగా లక్షల సంఖ్యలో ప్రజలు అనారోగ్యానికి గురవుతుంటే సుప్రీంకోర్టు చూస్తూ ఉండాలా
- పంట వ్యర్థాల కాల్చివేత ఒక్కటే ఈ సమస్యకు కారణం కాదని అది కేవలం ఇందులో ఒక భాగమే
- ఈ సమస్యకు కారణమైతే కోవిడ్–19 సమయంలో మనం ఆకాశంలోని నక్షత్రాలను చూడగలిగేవారిమా?
- ఢిల్లీ వాతావరణ కాలుష్యం కేవలం పంట వ్యర్థాల వల్ల ఏర్పడింది కాదు
- దీనిని నిర్మూలించడానికి మీరు తీసుకున్న చర్యలేంటో చూపండి".

## మీది ప్రజాపాలనా? తెలంగాణ ద్రోహుల పాలనా



- సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం
- కేసీఆర్ పోరాడి స్థానికులకు 95 శాతం రిజర్వేషన్లు సాధించారు
- జెన్‌కో సంస్థలో తెలంగాణ ఉద్యమాన్ని సమైక్యవాది కుమార్ రాజా అవమానిస్తే.. విద్యుత్ ఉద్యోగులు అతన్ని తరిమితరిమి కొట్టారు.
- బీఆర్ఎస్ అధికారంలో ఉండగా 1600 మెగావాట్లకు ఒప్పందం జరిగింది
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన 2400 మెగావాట్లపై ఒప్పందం కోసం ఎన్టీపీసీ కోరింది

హైదరాబాద్

నీది ప్రజాపాలనా.. తెలంగాణ ద్రోహుల పాలనా అని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ శాఖలో మొత్తం ఉన్నతాధికారులుగా తెలంగాణ ద్రోహులనే నియమిస్తుందని మండిపడ్డారు. ఆ పోస్టులకు తెలంగాణలో సమర్థవంతమైన అధికారులే మీకు దొరకడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పోరాడి స్థానికులకు 95 శాతం రిజర్వేషన్లు సాధించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ శాఖలోని పై పోస్టుల్లో ఆంధ్రావాళ్లనే నియమించారని తెలిపారు. జెన్‌కో హైడల్ అండ్ థర్మల్ డైరెక్టర్‌గా రాజశేఖర్ రెడ్డిని తీసుకున్నారని తెలిపారు. రాజశేఖర్ రెడ్డి సింగరేణిలో పనిచేసి రిటైర్ - మిగతా3లో

## మేడారం అభివృద్ధిపై ఫోకస్

- మేడారం ఆలయ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు
- గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దు
- ఆలయ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దు
- మేడారం ఆలయ నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దు
- గద్దెల సమీపంలో వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి



హైదరాబాద్

మేడారం ఆలయ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆలయ పనులపై జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయ పనులపైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు అధికారులు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు సీఎం రేవంత్‌రెడ్డి. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఆలయ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దని సూచించారు. మేడారం ఆలయ నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని ఆదేశించారు. గద్దెల సమీపంలో వరద నీరు - మిగతా3లో

## ఆర్‌బీఐ సమావేశం ఎఫెక్ట్... స్వల్ప నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

- ఆర్‌బీఐ సమావేశం ముందు ఇన్వెస్టర్ల అప్రమత్తత
- స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ
- హెవీవెయిట్ షేర్లలో లాభాల స్వీకరణ ప్రభావం
- నవంబర్ అమ్మకాలతో రాణించిన ఆటోమొబైల్ రంగం
- బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి




## సిద్ధరామయ్య నివాసంలో బ్రేక్ ఫాస్ట్ చర్చ ఎందుకు జరిగిందంటే

- డీకే శివకుమార్ కీలక వ్యాఖ్య
- మీడియా ఒత్తిడి కారణంగానే బ్రేక్ ఫాస్ట్ చర్చ జరిగిందని వెల్లడి
- సిద్ధరామయ్య, తాను సోదరుల్లా కలిసి పని చేస్తున్నామన్న ఉప ముఖ్యమంత్రి
- కర్ణాటక కాంగ్రెస్‌లో గ్రూప్‌లు అంటూ ఏవీ లేవని స్పష్టీకరణ






## డిజిటల్ అరెస్టు కేసుల్ని దర్యాప్తు చేయండి

- సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు
- అవినీతి కోణంలోనూ స్వేచ్ఛగా దర్యాప్తు చేపట్టవచ్చు
- సైబర్ నేరగాళ్లకు చెందిన మ్యూల్ అకౌంట్ల అంశంలో బ్యాంకుల పాత్రను కూడా ప్రశ్నించేందుకు సీబీఐకి కోర్టు అధికారాలు జారీ



## పార్లమెంటరీ మర్యాదలను 11 ఏళ్లుగా తుంగలో తొక్కారు..

- మోదీ వ్యాఖ్యలపై ఖర్గే
- గత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులు హడావిడిగా ఆమోదించారు
- కొన్ని బిల్లులు కేవలం 15 నిమిషాల్లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించారు
- మణిపూర్ వంటి కీలక అంశాలపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేంతవరకూ ప్రభుత్వం మౌనంగానే ఉండిపోయింది

# పార్లమెంటరీ మర్యాదలను 11 ఏళ్లుగా తుంగలో తొక్కారు

**న్యూఢిల్లీ:** పరాజయాన్ని అంగీకరించే మనసు ప్రతిపక్షాలకు లేదని, వాళ్లు వ్యూహం మార్చుకుంటే కొన్ని 'టిప్స్' ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని, సభా సమయాల్లో మాత్రం డ్రామాలు వద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. పార్లమెంటరీ మర్యాదలను, పార్లమెంటరీ వ్యవస్థను గత 11 ఏళ్లుగా ప్రభుత్వం అణిచివేస్తూనే ఉందని ఆరోపించారు. గత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులు హడావిడిగా ఆమోదించారని, కొన్ని బిల్లులు కేవలం 15 నిమిషాల్లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించారని గుర్తుచేశారు. జీఎస్టీ, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, రైతు వ్యతిరేక చట్టాలు పార్లమెంటు ద్వారా ప్రభుత్వం బుల్డోజింగ్ చేసిన బిల్లులని ఆక్షేపణ తెలిపారు.

**నాటకీయ ప్రసంగం**

శీతాకాల సమావేశాల తొలి రోజే పార్లమెంటు ముందున్న



కీలక అంశాల గురించి మోదీ ప్రస్తావించే బదులు నాటకీయ ప్రసంగం సాగించారని ఖర్గే తప్పుపట్టారు. 11 ఏళ్లుగా పార్లమెంటరీ మర్యాదలు, వ్యవస్థను ప్రభుత్వం అణిచివేస్తోందన్నదే అసలు నిజమని అన్నారు. మణిపూర్ వంటి కీలక అంశాలపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేంతవరకూ ప్రభుత్వం మౌనంగానే ఉండిపోయిందని, ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఒత్తిడికి గురై బీఎల్ఓలు చనిపోతే ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపులేదని విమర్శించారు. 'ఓటు చోరీ' వంటి కీలకాంశాలను విపక్షం లేవనెత్తుతూనే ఉంటుందని, ప్రభుత్వం డ్రామాలు కట్టిపెట్టి పార్లమెంటులో ప్రజాసమస్యలపై చర్చకు ముందుకురావాలని సూచించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానత్వం, దేశ విలువైన వనరుల లూటీ వంటివి నిజమైన ప్రజాసమస్యలనీ, అయితే అధికారంలో ఉన్న వారు అధికార దురహంకారంతో డ్రామాలాడుతున్నారని ఖర్గే విమర్శించారు. బిహార్ ఓటమి నుంచి వాళ్లు (విపక్షాలు) బయటకు రావడం లేదంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై మాట్లాడుతూ, ప్రతికూల ధోరణి రాజకీయాల్లో పనికొస్తుందే కానీ జాతి నిర్మాణానికి సానుకూల ఆలోచనా దృక్పథం అవసరమని, ప్రతికూలతా ఆలోచలను ప్రభుత్వం పక్కనపెట్టి జాతినిర్మాణంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

# 'ఇదేమీ నాటకం కాదు'
# ప్రధాని మోదీపై ప్రియాంక ఫైర్

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభంలోనే అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రధాని నరేంద్ర మోదీ సభలో 'డ్రామా'కు కాకుండా, 'డెలివరీ' (పని)కి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఎదురుదాడి చేశారు. పార్లమెంటు సమావేశాలకు ముందు ప్రధాని మోదీ తన ప్రసంగంలో.. ప్రతిపక్షాలు తమ పాత వ్యూహాలను మార్చుకోవాలని, చర్చలకు అవకాశం ఇవ్వాలని సూచించారు. 'డ్రామా కాదు, డెలివరీ ఉండాలి.. నినాదాలు కాదు, విధానాలకు ప్రాధాన్యత నివ్వాలి' అని అన్నారు. తొలిసారిగా ఎన్నికైన ఎంపీలకు మాట్లాడే అవకాశం రావడం లేదని, డ్రామా చేయడానికి పార్లమెంట్ సరైన వేదిక కాదని ఆయన ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ప్రియాంక గాంధీ.. ఢిల్లీలో వాయు కాలుష్యం, ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తదితర క్లిష్టమైన సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తడం నాటకం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల పరిస్థితులు, ఎస్ఐఆర్, కాలుష్యం మొదలైనవి చాలా పెద్ద సమస్యలని, వాటిపై చర్చిద్దామని ప్రియాంకా గాంధీ అన్నారు. పార్లమెంటు ఉన్నది దేనికి?.. నాటకాలకు కాదు. సమస్యలపై మాట్లాడటం, లేవనెత్తడం నాటకం కాదని ఆమె అన్నారు. సభలో ప్రజా సమస్యలపై చర్చలకు అనుమతించడం





లేదంటూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. కాగా ఈ శీతాకాల సమావేశాలు కేవలం 15 రోజులు మాత్రమే జరగడంపై ప్రతిపక్షాలు ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రభుత్వం కావాలనే సమావేశాలను తగ్గించి, శాసనసభ చర్చలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించాయి. ప్రభుత్వం 14 బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ సమస్యలు, బీఎల్ఓ ఆత్మహత్యలు, ఢిల్లీ ఉగ్ర దాడి, జాతీయ భద్రతా అంశాలపై చర్చలకు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో పార్లమెంట్‌లో రాజకీయ వేడి మరింతగా పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# సిద్ధరామయ్య నివాసంలో బ్రేక్ ఫాస్ట్ చర్చ ఎందుకు జరిగిందంటే

ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో బ్రేక్‌ఫాస్ట్ చర్చలకు ఎందుకు కూర్చున్నామనే విషయాన్ని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వివరించారు. మీడియా ఒత్తిడి కారణంగానే తాము కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. "మరి మీరు సిద్ధరామయ్యను ఎప్పుడు బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానిస్తున్నారు?" అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, అది తమ ఇద్దరికి సంబంధించిన విషయమని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. అధిష్ఠానం సూచనల మేరకు సిద్ధరామయ్య మూడు రోజుల క్రితం ఉప ముఖ్యమంత్రిని బ్రేక్‌ఫాస్ట్ చర్చకు ఆహ్వానించారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. సిద్ధరామయ్య స్థానంలో డీకే శివకుమార్‌కు అవకాశం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి వర్గం కోరుతున్నట్లు మీడియాలో



కథనాలు వస్తున్నాయి. కర్ణాటక కాంగ్రెస్, ప్రభుత్వంలో రెండు వర్గాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ ఈరోజు స్పందించారు. సిద్ధరామయ్య, తాను సోదరుల్లా కలిసి ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో లేదా ప్రభుత్వంలో సిద్ధరామయ్య గ్రూప్ లేదా డీకే శివకుమార్ గ్రూప్ అంటూ ఏమీ లేవని స్పష్టం చేశారు. మీడియా మాత్రం కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో గ్రూప్‌లు ఉన్నట్లు ప్రచారం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా ఒత్తిడి వల్లే తాము ఇటీవల బ్రేక్‌ఫాస్ట్ చర్చలు జరిపామని తెలిపారు. "సిద్ధరామయ్య గ్రూప్, డీకే శివకుమార్ గ్రూప్, మరో గ్రూప్ అంటూ మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన బ్రేక్‌ఫాస్ట్ చర్చల్లో పార్టీ గురించి మాట్లాడుకున్నాం. దీని గురించి మీడియా ఆలోచించకపోవడం మంచిది" అని డీకే శివకుమార్ అన్నారు.

# ఇక్కడ డ్రామాలొద్దు..

**న్యూఢిల్లీ :** బిహార్ ఓటమి నుంచి ఇంకా బయటకు రాలేదంటూ ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ చురకలంటించారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన సూచించారు. మీ బాధ్యతను మీరు నిర్వర్తించండంటూ ఆయా పార్టీలకు ప్రధాని హితవు పలికారు. పార్లమెంటులో బలమైన అంశాలతోపాటు ప్రశ్నలు లేవనెత్తండంటూ వారికి కీలక సూచన చేశారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం అంటే ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ సమావేశాలకు ముందు సభ్యులను ఉద్దేశించి పార్లమెంట్ ఎదుట ప్రధాని మోదీ ప్రసంగించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి అని వివరించారు. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని తాను ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. బిహార్ ఎన్నికల్లో ప్రజలు అత్యధిక ఓటింగ్‌తో ప్రజాస్వామ్యాన్ని బలపరిచారు. పదేళ్లుగా వీళ్లు ఆడుతున్న డ్రామాలను దేశం నమ్మడం లేదు. పరాజయాన్ని కూడా అంగీకరించే మనసు విపక్షాలకు ఉండడం లేదు. అయితే మీ ఓటమి, నిరాశలకు సమావేశాలను బలి కానివ్వొద్దు. డ్రామాలు ఆడేందుకు వేరే వేదికలు ఉన్నాయి. చట్ట సభల్లో వద్దు. వికసిత్ భారత్‌కు లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. కాబట్టి మీ సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వండి..




సమస్యలను గళం వినిపించేందుకు ఎంపీలకు అవకాశమే దొరకడం లేదు. తొలిసారి సభలో అడుగుపెట్టిన వారికి మాట్లాడే అవకాశం ఇవ్వండి. సభ సజావుగా సాగేందుకు సహకరించండి. దేశం కోసం పార్లమెంట్ ఏం చేస్తుందో తెలియజేయండి. ఈ పార్లమెంట్ సమావేశాల్లో అర్థవంతమైన చర్చ జరుగుతుందని ఆశిస్తున్నా అంటూ మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

సోమవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఇవి ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సెలవు రోజులు మినహా మొత్తం 15 రోజులపాటు ఈ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ఆమోదం పొందనున్నాయి. ఆదివారం అఖిలపక్షం..

ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఆటంకాలు సృష్టించ వద్దని విపక్షాలను కోరామన్నారు. దాదాపు గంటన్నర పాటు ఈ అఖిలపక్ష భేటీ జరిగింది. ఈ భేటీలో విపక్షాల డిమాండ్లు విన్నారేగానీ ఏమాత్రం స్పందించలేదని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు.

ఈ అఖిల పక్ష సమావేశానికి కేంద్ర మంత్రులు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘవాల్, ఎల్.మురుగన్, అనుప్రియ పటేల్‌తోపాటు జైరామ్ రమేశ్ (కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), మిథున్‌రెడ్డి (వైసీపీ), సురేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), బాలశౌరి (జనసేన) సహా 36 పార్టీల నుంచి దాదాపు 50మంది నేతలు పాల్గొన్నారు. కృష్ణా జలాల వినియోగం, కేటాయింపులపై పార్లమెంట్‌లో చర్చించాలని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల అంశాన్ని పరిష్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్ తెలిపారు.

## ప్రాణాలు పోతుంటే చర్యలు తీసుకోరా?



ఢిల్లీ వాతావరణ కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. దేశ రాజధానిలో గాలి కాలుష్యాన్ని తగ్గించడానికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని నొక్కిచెప్పింది. గాలి నాణ్యత కారణంగా లక్షల సంఖ్యలో ప్రజలు అనారోగ్యానికి గురవుతుంటే సుప్రీంకోర్టు చూస్తూ ఉండాలా అని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ని ప్రశ్నించింది.
ఢిల్లీలో గాలి కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. గాలి నాణ్యత ఎంత తీవ్ర ప్రమాదకర స్థాయికి చేరుతుంటే ఎటువంటి చర్యలు తీసుకొంటున్నారని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ తో పాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ ను ప్రశ్నించింది. వాయు కాలుష్యంతో లక్షల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటే సుప్రీం కోర్టు చూస్తూ ఉండాలా అని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. పంట వ్యర్థాల కాల్చివేత ఒక్కటే ఈ సమస్యకు కారణం కాదని అది కేవలం ఇందులో ఒక భాగమేనని తెలిపింది. జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ "సుప్రీంకోర్టు ఈ సమస్యపై చూస్తూ ఉండలేదు. "పంటవ్యర్థాల కాల్చివేత ఈ సమస్యకు కారణమైతే కోవిడ్-19 సమయంలో మనం ఆకాశంలోని నక్షత్రాలను చూడగలిగేవారిమా? ఈ సమస్యను రాజకీయంగా చూడకూడదు. ఢిల్లీ వాతావరణ కాలుష్యం కేవలం పంట వ్యర్థాల వల్ల ఏర్పడింది కాదు. దీనిని నిర్మూలించడానికి మీరు తీసుకున్న చర్యలేంటో చూపండి". అని చీఫ్ జస్టిస్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ని ప్రశ్నించారు. ఈ సమస్యను పరిష్కరించే అంశం కోర్టుల పరిధిలోనిది కాదని నిపుణులతో కూడిన కమిటీ వాయు కాలుష్య సమస్యకు పరిష్కారం కనుగొనాలని తెలిపారు. కోర్టులు ఈ సమస్యలను రూపుమాపవు కాని దానికి కావాల్సిన వేదికను ఏర్పాటు చేయగలవు. అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. గాలి కాలుష్యాన్ని పరిష్కరించడానికి స్పష్టమైన సమయాన్ని నిర్దేశించుకొని తగిన ప్రణాళిక రూపొందించాలని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా పేర్కొంది.

## డిజిటల్ అరెస్టు కేసుల్ని దర్యాప్తు చేయండి

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు ఇవాళ సంచలన ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ అరెస్టు స్కామ్ కేసుల్లో .. దర్యాప్తు చేపట్టాలని సీబీఐని ఆదేశించింది. అవినీతి కోణంలోనూ స్వేచ్ఛగా దర్యాప్తు చేపట్టవచ్చు అని కోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. సైబర్ నేరగాళ్లకు చెందిన మ్యూల్ అకౌంట్ల అంశంలో బ్యాంకుల పాత్రను కూడా ప్రశ్నించేందుకు సీబీఐకి కోర్టు అధికారాలు జారీ




చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చి ఈ కేసులో స్పందించారు. ఇప్పటి వరకు జరిగింది చాలు అని, డిజిటల్ అరెస్టు స్కామ్‌లను తక్షణమే సీబీఐ దర్యాప్తు చేయాలని ధర్మాసనం కోరింది. ఇప్పటి వరకు బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు సుమారు 3 వేల కోట్ల అక్రమాలకు పాల్పడినట్ల సుప్రీంకోర్టుకు కేంద్రం వెల్లడించిన విషయం తెలిసిందే. డిజిటల్ అరెస్టులపై దాఖలైన సుమోటో కేసులో ధర్మాసనం ఆదేశాలు జార చేసింది. నకిలీ అకౌంట్లను గుర్తించేందుకు ఏఐ మెషీన్ టూల్స్ పట్ల అవగాహన కల్పించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సుప్రీం కోరింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన సైబర్ క్రైం యూనిట్లు సమర్థవంతంగా పనిచేయాలని, ఎటువంటి అవరోధాలు ఎదురైనా కోర్టుకు తెలియజేయాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ-మెయిల్ ద్వారా సమాచారన్ని చేరవేయవచ్చు అని కోర్టు చెప్పింది. విదేశాల్లో ఉన్న నేరస్థులను పట్టుకునేందుకు ఇంటర్‌పోల్ సహాయం తీసుకోవాలని కూడా కోర్టు సూచించింది.

## ఆర్‌బీఐ సమావేశం ఎఫెక్ట్...
## స్వల్ప నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ఈ వారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరగనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. దీనికి తోడు హెవీవెయిట్ షేర్లలో లాభాల స్వీకరణ జరగడంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ, ఆ జోరును చివరి వరకు కొనసాగించలేకపోయాయి. టేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 64.77 పాయింట్ల నష్టంతో 85,641.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27.20 పాయింట్లు కోల్పోయి 26,175.75 వద్ద ముగిసింది. రెండో త్రైమాసికం జీడీపీ వృద్ధి మెరుగ్గా నమోదు కావడం, రూపాయి విలువ బలహీనపడటంతో డిసెంబర్‌లో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు తగ్గాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో మార్కెట్లు ఒక రేంజ్‌కే పరిమితమయ్యాయని వారు పేర్కొన్నారు. దీనికి తోడు నవంబర్‌లో జీఎస్టీ వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం కూడా సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. అయితే, ఆటోమొబైల్ రంగం మాత్రం రాణించింది. నవంబర్‌లో బలమైన అమ్మకాలు, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్ వంటివి ఈ రంగానికి కలిసొచ్చాయి. నిఫ్టీ ఆటో సూచీ 0.25 శాతం పెరిగింది. మరోవైపు, నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ రంగాలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.39 శాతం లాభపడింది. ప్రధాన షేర్లలో బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నష్టపోగా.. టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, కోటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఫ్లాట్‌గా ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.25 శాతం లాభంతో సెషన్‌ను ముగించింది.

## బెంగాల్‌లో పోలింగ్ బూత్ స్థాయి అధికారుల నిరసన.. 'సర్' పని ఒత్తిడిపై ఆందోళన

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విధులు నిర్వహిస్తున్న పోలింగ్ బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వో) భారీ నిరసన చేపట్టారు. పని ఒత్తిడి, పని పరిస్థితులు, మానసిక ఆరోగ్యంపై ఆందోళన చెందారు. బీఎల్‌వో అధికార్ రక్షా కమిటీ నేతృత్వంలో సోమవారం మధ్యాహ్నం కోల్‌కతాలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వెలుపల భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. 'సర్' విధుల వల్ల ఒత్తిడి, పని పరిస్థితులు, మానసిక ఆరోగ్య పరిస్థితుల వల్ల కొందరు బీఎల్‌వోలు ఆత్మహత్యలకు పాల్పడటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు వారు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా, సోమవారం ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో శాసనసభ్యుల బృందంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీకి చెందిన ప్రతిపక్ష నేత సువేందు అధికారి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అక్కడకు చేరుకున్నారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా 'వెనక్కి వెళ్లిపోండి' అంటూ నిరసన చేస్తున్న బీఎల్‌వోలు బీజేపీ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు బీజేపీ కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. నిరసన చేస్తున్న బీఎల్‌వోలకు ప్రతిగా నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొన్నది. అయినప్పటికీ బీజేపీ నేతలు ఆ కార్యాలయంలోకి వెళ్లారు.

# విద్యాభివృద్ధి ముఖ్యం

-మొదటిపేజీ తరువాయి

పక్కనే ఉన్న పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలని సోయి 70 ఏళ్లుగా పాలకులు లేకుండా పోయింది.
ఆ పని నేను చేస్తున్నందుకు ఇవాళ నాకు ఎంతో సంతోషంగా ఉంది. రెండేళ్లలో నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కావాలి. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానిది. సన్నబియ్యం ఇస్తున్నాం. బీసీల జనాభా 56 శాతం ఉన్న లెక్క తేల్చిన ఘనత మాది. గ్రామపంచాయితీ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలి. అభివృద్ధి ఆకాంక్షించే వారిని సర్పంచ్‌గా గెలిపించాలి' అని సీఎం రేవంత్ సూచించారు

**మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదు..**

ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన తర్వాత కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.

**ఆటోడ్రైవర్లను రెచ్చగొడుతున్నారు..**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే.. ఆటోడ్రైవర్లను మాజీ మంత్రి కేటీఆర్ అండ్ కో రెచ్చగొట్టి తమ మీదకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు సీఎం. తమ ప్రభుత్వంలో పేదలకు కూడా సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తుచేశారు. మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి పాలమూరును ఆదర్శంగా మారుస్తామని వివరించారు. ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధమని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వంలో ఇరిగేషన్‌తో పాటు ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి పేద బిడ్డకు చదువు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళు ప్రారంభించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది...**

'గత పాలకుల నిర్లక్ష్యానికి బలైన మక్తల్ నుంచి ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు ప్రారంభించడం నాకు చాలా



సంతోషంగా ఉంది. ఇప్పటిదాకా మక్తల్ నారాయణపేట కొడంగల్‌కు సాగునీరు ఇవ్వాలని ఎవ్వరికీ అనిపించలేదు. కానీ 12 మందిని మీరు ఆశీర్వదించి పంపిస్తే నాకు ఇక్కడి ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది. మన కష్టాలను తీర్చేందుకు ఎవ్వరూ బాధ్యత తీసుకోలేదు. కానీ మీ సోదరుడిగా.. మీతో పాటు పెరిగిన బిడ్డగా సీఎంగా వచ్చాను. పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది. కానీ మోసగిస్తే పాతాళానికి తొక్కింది.. ఇది కేసీఆర్ విషయంలో జరిగింది. గతంలో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి.. సీఎంగా చేస్తే.. మన జిల్లాలో ఎలాంటి ప్రాజెక్టు పూర్తి చేయలేదు. రూ.12 కోట్లు కేటాయించి సంగంబండ రిజర్వాయర్ పూర్తి చేయలేదు. అందుకే ఎవరికో పెద్దరికం ఇవ్వొద్దని.. మన బిడ్డ సీఎంగా ఉండాలని మీరు కోరుకున్నారు. మంత్రి మండలి సహకారంతో.. ఇక్కడ అన్ని ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తున్నాం.. గతంలో జీవో నెంబరు– 69 ద్వారా వచ్చిన నారాయణపేట – కొడంగల్ ప్రాజెక్టును పక్కన పెట్టారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తున్నాం. ఇప్పటికీ కొంతమంది అడ్డంకులు పెట్టారు.. కానీ మా మంత్రి వాకిటి శ్రీహరి రైతులతో మాట్లాడి.. ఎకరానికి రూ.20 లక్షల పరిహారంతో 95 శాతం మంది రైతులు భూములు ఇవ్వడానికి ఒప్పుకోవడంతో పనులు ప్రారంభించాం. ఇది నా జీవితంలో చాలా సంతోషకరమైన విషయం. రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఈ ప్రాజెక్టుకు ఎవరైనా అడ్డుపడితే ఊరుకోం' అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

**విద్యాభివృద్ధి ముఖ్యం..**

'విద్యాభివృద్ధి కూడా ముఖ్యం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రూ. 200 కోట్లతో ఏర్పాటు చేశాం. మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ నేతలు ఇద్దరు గెలవక పోయినా 14 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ తీసుకువస్తున్నాం.. యెన్నం శ్రీనివాస్ రెడ్డి అడిగిన వెంటనే ట్రిపుల్ ఐటీ కాలేజీ తెచ్చాం.. పాలమూరు విశ్వవిద్యాలయంలో కావాల్సిన కోర్సులన్నీ తెచ్చా.. పాలమూరు జిల్లా విద్యాపరంగా రాష్ట్రానికి మోడల్‌గా ఉండాలి. సన్నబియ్యం, ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్సు అన్నీ అమలు చేస్తున్నాం.. ఇది చాలదన్నట్లు మా ఆడబిడ్డలు పెట్రోల్ బంకులు, వెయ్యి బస్సులకు యజమానులు అయ్యారు. అంబానీ, అదానీలకు సమానంగా హై టెక్ సిటీలో మా అక్కలకు స్టాల్స్ వచ్చాయి. మీరు ఒక్కసారి ఆశీర్వదిస్తే ఇవన్నీ సాధ్యమయ్యాయి. అందుకే మాకు అండగా ఉన్న పాలమూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. మా మాదిగ సోదరులు వర్గీకరణ కోసం చేయని పోరాటంలేదు.. కానీ సుప్రీంకోర్టు తీర్పు వెంటనే నేను వర్గీకరణ చేసి మాల, మాదిగ పంచాయితీ లేకుండా చేసి చూపించా. బీసీ లెక్క చేసి.. దేశానికి ఆదర్శంగా నిలిచాం. సంక్షోభం దిశలో ఉన్న రాష్ట్రాన్ని సక్కగా చేస్తున్నా. గత కేసీఆర్ ప్రభుత్వంలో రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కష్టాలు పడి అప్పులు తీర్చుకుంటూ అభివృద్ధిని చేసి చూపిస్తున్నాం. కాళ్లల్లో కట్టెలు పెట్టే వారిని సర్పంచులుగా గెలిపిస్తే.. మళ్లీ అడ్డంకులు సృష్టిస్తారు. డిసెంబరు 8, 9వ తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ పెట్టుకుని.. మన తెలంగాణ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుదాం. ఇన్ని చేస్తుంటే.. మీరు సర్పంచులుగా వేరే వారిని గెలిపిస్తే.. అభివృద్ధిని అడ్డుకుంటారు. పార్టీలను పదేళ్లు పక్కన పెడదాం.. మన పాలమూరును అభివృద్ధి చేసుకుందాం. ఈ గడ్డ దేశానికి జైపాల్‌రెడ్డి లాంటి నాయకుడిని.. మనకు బూర్గుల రామకృష్ణారావు లాటి తొలి సీఎంను ఇచ్చింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే మమ్మల్ని గెలిపించారో.. ఇప్పుడు సర్పంచులుగా కాంగ్రెస్ నేతలను ఆశీర్వదించి.. మన ప్రభుత్వ అభివృద్ధిని కొనసాగించాలి. మీ అందరి ఆశీర్వాదం తీసుకుని తెలంగాణ రాష్ట్రం మొత్తం తిరుగుతా' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఈనెల 7నుండి 9వరకు మెదక్ పట్టణంలో జరిగే సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు జయప్రదం చేయండి

**వేల్పుల కుమారస్వామి, జిల్లా అధ్యక్షులు**

గోదావరిఖని టౌన్, రిపోర్టర్
(శుభోదయం న్యూస్):

సీఐటీయూ అనుబంధ ప్లంబర్స్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం గోదావరిఖని సీఐటీయూ కార్యాలయంలో ఆర్.పరమేష్ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా వేల్పుల కుమారస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 7 నుండి 9వరకు మెదక్ పట్టణంలో సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు జరుగుతున్నాయని మొదటి రోజు భారీ కార్మిక ప్రదర్శన అనంతరం బహిరంగ సభ ఉంటుందని అన్నారు.దీనికి ముఖ్య అతిథులుగా బి.వి.రాఘవులు ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి, కె.హేమలత సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు తో పాటుగా ఎం.సాయి బాబు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్,ఎస్.వీరయ్య ఎస్.వి.రమ, వంగూరు రాములు తదితరులు పాల్గొంటున్నారని ఈ సభకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు అధ్యక్షత




వహిస్తారు అన్నారు. 8,9 తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటుందని అన్నారు 33 జిల్లాల నుండి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హజరౌతారని అన్నారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించు కోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, కిషన్ సదయ్య సుదర్శన్ జే.బాబు రాజు దీక్షిత్ అంజత్, హైమద్, అవినాష్, మదు, మల్లేష్ కొమురయ్య కుమార్, కనకయ్య శ్రీనివాస్ మొగిలి నరేష్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మీది ప్రజాపాలనా? తెలంగాణ ద్రోహుల పాలనా

-మొదటిపేజీ తరువాయి

అయ్యాడని.. ఆయనకు విద్యుత్ ఉత్పత్తిలో ఎలాంటి అనుభవం లేదని పేర్కొన్నారు. జెన్‌కో సంస్థలో తెలంగాణ ఉద్యమాన్ని సమైక్యవాది కుమార్ రాజా అవమానిస్తే.. విద్యుత్ ఉద్యోగులు అతన్ని తరిమితరిమి కొట్టారని తెలిపారు. అలాంటి కుమార్ రాజాను తీసుకొచ్చి నేడు విద్యుత్ ఉద్యోగుల మీద పెత్తనం చేసేందుకు డైరెక్టర్‌గా నియమించారని మండిపడ్డారు. ఇది ప్రజాపాలనా? తెలంగాణ ద్రోహుల పాలనా? అని ప్రశ్నించారు.
మధ్యప్రదేశ్‌లో మైనింగ్ ఇంజనీర్‌గా పనిచేసిన ఆంధ్రా ప్రాంతానికి చెందిన శివాజీని ఎస్పీడీసీఎల్‌లో కీలకమైన పోస్టులో నియమించారని హరీశ్‌రావు తెలిపారు. అనుభవజ్ఞులైన ఐదారుగురు దళిత రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు ఉన్నా ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ గడ్డపై పనిచేయని ఏపీ వ్యక్తి నర్సింహులును ఎస్పీడీసీఎల్ డైరెక్టర్‌గా పెట్టారని తెలిపారు. రెడ్కో సంస్థ సీఎండీగా ఆంధ్రా ప్రాంతానికి చెందిన జూనియర్ మోస్ట్ డీఈ వావిలాల అనీలను నియమించారని అన్నారు.
తెలంగాణలో సమర్థవంతమైన అధికారులు మీకు దొరకడం లేదా అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. అనేకమంది తెలంగాణ దళితబిడ్డలు సమర్థులైన అధికారులు ఉన్నారని తెలిపారు. ఇక్కడ ప్రభుత్వం తెలంగాణ వాళ్లు నడుపుతున్నారా? ఆంధ్రా పాలకులు నడుతుపున్నారా అని ప్రశ్నించారు. చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్‌గా అవినీతిపరుడైన ఆంధ్రా వ్యక్తిని నియమించారని అన్నారు. అతను గ్రీన్ ఎనర్జీ అప్లికేషన్ ఫీజు రూ.25వేల చొప్పున రూ.600 కోట్లు వసూలు చేశారని తెలిపారు. చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసు మెగావాట్‌కు రూ.25లక్షలు అడిగారని తెలిపారు. పైవాళ్లకు కూడా ఇవ్వాలని రూ.30 లక్షలకు రేటు పెంచారని అన్నారు. ఇంకా లంచాల లెక్కతేలక ఆర్నెల్ల నుంచి పెండింగ్‌లో పెట్టారని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఎలక్ట్రిసిటీ ఇన్‌స్పెక్టర్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఆంధ్రా అధికారులను తొలగించి తెలంగాణ వాళ్లకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**అప్పులు పుట్టడం లేదంటున్న రేవంత్.. నిధులు ఎక్కడి నుంచి తెస్తారు.. ముఖ్యమంత్రిని నిలదీసిన హరీశ్‌రావు**

కాంగ్రెస్ అప్పులు, తప్పులు తెలంగాణ ప్రజలకు భారంగా మారుతున్నాయని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా తెలంగాణకు ఎన్టీపీసీ 4 వేల మెగావాట్ల ప్లాంట్ నిర్మించిందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా 1600 మెగావాట్లకు ఒప్పందం జరిగిందని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన 2400 మెగావాట్లపై ఒప్పందం కోసం ఎన్టీపీసీ కోరిందని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎన్టీపీసీ సీఎండీ మూడు సార్లు కలిశారని పేర్కొన్నారు. ఎక్కువ ధరకు ఎన్టీపీసీ నుంచి ఎందుకు కొనాలని సీఎం చెప్పారని తెలిపారు. 60 శాతం ఉన్న థర్మల్ పవర్‌ను 40 శాతానికి తగ్గిస్తామని శ్వేతపత్రం పెట్టారని గుర్తుచేశారు. కమీషన్ల కోసం ఇప్పుడు థర్మల్ పవర్ ప్లాంట్లు పెడతామంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రకటించారని అన్నారు. ఇప్పుడు గ్రీన్ ఎనర్జీని వదిలేసి థర్మల్‌కు ఎందుకెళ్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు.
ఎన్టీపీసీ నుంచి 800 మెగావాట్లకు యూనిట్‌కు రూ.4.12 ప్రకారం ఒప్పందం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. రామగుండం 800, పాల్వంచ 800, మక్తల్ 800 మెగావాట్ల ప్రతిపాదనలు పెట్టారని అన్నారు. రామగుండం ప్లాంట్‌కు జెన్కో డీపీఆర్ ఇచ్చిందని తెలిపారు. 800 మెగావాట్లకు రూ.10,800 కోట్ల ఖర్చుతో ప్రతిపాదనలు పెట్టిందని పేర్కొన్నారు. మూడు ప్లాంట్లకు కలిపి రూ.45 వేల కోట్ల ఖర్చవుతుందని చెప్పిందన్నారు. కొత్త ప్లాంట్లలో ఉత్పత్తికి యూనిట్‌కు రూ.7.70 ఖర్చవుతుందని అన్నారు. ఎన్టీపీసీ కంటే యూనిట్‌కు రూ.3 కంటే ఎక్కువ ఖర్చవుతుందని అన్నారు. సొంత ప్లాంట్లలో ఉత్పత్తి వల్ల రోజుకు 9 కోట్లు ప్రజలపై భారం పడుతుందని వివరించారు. అంటే ఏడాదికి రూ.3800 కోట్ల అదనపు భారం పడుతుంని అన్నారు. కరెంటు కొనుగోలు కోసం 25 ఏళ్ల ఒప్పందం చేసుకుంటారని.. అలా పాతికేళ్లలో తెలంగాణ ప్రజలపై రూ.82వేల కోట్ల భారం పడుతుందని తెలిపారు.
అప్పు, మిత్తి లేకుండా కరెంటు ఇవ్వడానికి ఎన్టీపీసీ సిద్ధంగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. అప్పు పుట్టడం లేదంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. కమీషన్ల కోసమే కొత్త విద్యుత్ ప్లాంట్లు కడతామని కాంగ్రెస్ చెబుతుందని విమర్శించారు. ప్రజలపై భారం పడవద్దనే బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని తెలిపారు.
మాట్లాడేటప్పుడు కాంగ్రెస్ గత చరిత్ర చూసుకోవాలని భట్టి విక్రమార్కకు హరీశ్‌రావు హితవు పలికారు. ఏ బొగ్గు ఉన్నదని విజయవాడ, రాయలసీమ, కృష్ణపట్నంలో విద్యుత్ ప్లాంట్లు కట్టారని ప్రశ్నించారు. బ్యాలెన్స్ చేసుకోవడానికే వేర్వేరు చోట్ల థర్మల్ ప్లాంట్లు కడతారని తెలిపారు. థర్మల్ ప్లాంట్లలో ఫ్లై యాష్ ప్రధాన సమస్యగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి, నీరు అందుబాటులో ఉండటం వల్లనే దామరచర్లలో ప్లాంట్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఫ్లైయాష్ వాడుకుం టామని సిమెంట్ ఫ్యాక్టరీలు ఒప్పందం చేసుకున్నాయని అన్నారు.

## వారికి ఐఏఎస్ హోదా ఎందుకు కల్పించారు?

-మొదటిపేజీ తరువాయి

నోటీసులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 26వ తేదీన విడుదల చేసిన జీవో 1342 ప్రకారం పలువురు ఐపీఎస్ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించిందని, అది చట్టవిరుద్ధమని వడ్ల శ్రీకాంత్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శ్రీకాంత్ తరఫున సీనియర్ న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద ధర్మాసనం ముగ్గురు అధికారులకు ఐఏఎస్ హోదాను ఎందుకు కల్పించారో డిసెంబర్ 10వ తేదీ లోపు వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జారీ చేసిన నోటీసుల్లో ఆదేశించారు.

## మేడారం అభివృద్ధిపై ఫోకస్

-మొదటిపేజీ తరువాయి

నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గద్దెల దగ్గర నాలుగు వైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. గద్దెలకు గ్రాండ్ లుక్ వచ్చేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. గుడి చుట్టూరా పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కరీంనగర్‌లో లవర్‌తో నామినేషన్...

**కరీంనగర్ :** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు.. ప్రియురాలితో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయించాడు. దీంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక తమకు రక్షణ కల్పించాలని సదరు యువతి, యువకుడు కూడా పోలీసులను ఆశ్రయించడం గమనార్హం. అంతకుముందు కరీంనగర్‌లో సర్పంచ్ అవ్వాలనే కోరికతో తొందరపడి పెళ్లి చేసుకున్న ఓ వ్యక్తి ప్లాన్ రివర్స్ అయిన సంగతి తెలిసిందే.గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ పదవి కోసం 25,654 నామినేషన్లు, వార్డు స్థానాలకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ వేళ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ అనే యువకుడు.. తన ప్రియురాలు శ్రీజతో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయించాడు. ఈ గ్రామంలో ఎస్సీకి సర్పంచ్ స్థానం రిజర్వ్ అయింది. దీంతో పెళ్లి చేసుకోకుండానే ప్రేయసితో నామినేషన్ వేయించాడు. ఈ ఘటన సర్వత్రా చర్చనీయాంశమైంది.ప్రస్తుతం ఆ యువతి బీటెక్ ఫైనల్ ఇయర్ చదవుతున్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులకు చెప్పకుండా సదరు యువతి.. ప్రియుడితో కలిసి నామినేషన్ వేసింది. ఈ విషయం తెలుసుకున్న ఆ యువతి తల్లిదండ్రులు.. తమ కూమార్తె కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు తమకు రక్షణ కల్పించాలంటూ యువతి, యువకుడు కూడా పోలీసులను ఆశ్రయించారు. తన ఇష్టంతోనే చంద్రశేఖర్ వద్దకు వచ్చానని యువతి చెప్పింది. తనను ఎవరూ బలవతం చేయలేదని తెలిపింది. అనంతరం తనను గెలిపించాల్సిందా గ్రామంలో ప్రచారం చేసింది.ఇలాంటి ఘటనే కరీనంగర్ జిల్లాలో జరిగింది. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన ముచ్చె శంకర్ అనే వ్యక్తికి సర్పంచ్ కావాలనే చిరకాల కోరిక ఉంది. ఎన్నికల కోసం ఎప్పటినుంచో సన్నద్ధమవుతున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. పెళ్లి చేసుకుని తన భార్యను సర్పంచ్ కుర్చీలో కూర్చోబెట్టి చక్రం తిప్పుదామనుకున్నాడు. అయితే తాను అనుకున్న సమయం కంటే ముందే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో హడావిడిగా నల్గొండకు చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. అనంతరం భార్యను ఓటర్ జాబితాలో చేర్చడానికి దరఖాస్తు చేసుకున్నాడు

## భారం కానున్న విలీనం

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల చాలా కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ అభివృద్ధిపై దృష్టి పెట్టిన రేవంత్ సర్కార్.. తాజాగా నవంబర్ 25న నిర్వహించిన కేబినెట్ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ సమీపంలోని మున్సిపాలిటీలు, గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. అయితే దీనిపై ప్రజలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెజారిటీ సానుకూలంగా ఉన్నా, ఆస్తి పన్ను పెరుగుదల, నిధి ఉపయోగం గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.
మణికొండ, నార్సింగి వంటి ప్రాంతాలు ఆస్తి పన్నుల ద్వారా బలమైన ఆదాయం సంపాదిస్తున్నాయి, అయితే జవహర్‌నగర్, జల్పల్లి, తుక్కుగూడలో ఆర్థిక సమస్యలు ఉన్నాయి. విలీనం తర్వాత మొత్తం నిధులను ఎలా పంపిణీ చేస్తారో అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్థానిక అవసరాలకు ముందుతీసుకునేలా హామీ ఇవ్వాలని కోరుకుంటున్నారు.నగరానికి సమీపంలో ఉన్న వందల గ్రామాలను చేర్చినా, వాటి గ్రామీణ లక్షణాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. ప్రాంతాలవారీగా జనసాంద్రత భిన్నంగా ఉండడంతో మణికొండ, నార్సింగి వంటి దట్ట ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పెద్దఅంబర్‌పేట్, ఘట్కేసర్ ప్రాంతాల్లో తక్కువ జనాభాకు సరిపడా వనరులు కేటాయించాలని నిపుణులు సూచిస్తున్నారు.ఇక జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన రాజకీయ, సామాజిక ఘర్షణలకు దారితీయవచ్చు. ఇవి సమర్థవంతంగా పరిష్కరించకపోతే విలీన ప్రక్రియ సమస్యలకు దారితీస్తుంది. సమతుల్య పరిపాలన కోసం అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.ప్రజలు ప్రయోజనాలను ఆశిస్తూ, స్థానిక అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చేలా పారదర్శకత కావాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక అమలు చేస్తే బృహత్తర అభివృద్ధి సాధ్యమవుతుంది.

**మరి వాటి సంగతేంటీ**


ఒకప్పుడు హైదరాబాద్ ఒక స్థాయి వరకు ఉండేది. ఎప్పుడైతే ఔటర్ రింగ్ రోడ్డు అనేది అందుబాటులోకి వచ్చిందో.. అప్పుడే హైదరాబాదు రూపు రేఖలు మారిపోయాయి. కొత్త హైదరాబాద్ పుట్టుకొచ్చింది. శివారు ప్రాంతాలు విపరీతంగా అభివృద్ధి చెందడంతో హైదరాబాద్ నగరం మహానగరంగా విస్తరించింది. అప్పట్లో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలు ప్రాంతాలను మునిసిపాలిటీలుగా రూపొందించారు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను మరింతగా విస్తరించే కార్యక్రమానికి రూపకల్పన చేసిందిహైదరాబాద్ నగర పరిధిలో ఉన్న పురపాలకాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంస్థలో కలిపేసింది.. ప్రభుత్వ నిర్ణయంతో ఇన్ని రోజులపాటు పురపాలకాల పరిధిలో ఉన్న ప్రజలలో ఇప్పుడు సరికొత్త చర్చ మొదలైంది. వారికి లభించే ప్రయోజనాలు, ఎదురయ్యే నష్టాల గురించి చర్చించుకుంటున్నారు.హైదరాబాద్ పరిధిలో పురపాలకాలను విలీనం చేసిన క్రమంలో ఆస్తి పన్ను పెరుగుతుందా? చెల్లించే పనులు ఇతర ప్రాంతాలలో ఖర్చు చేస్తారా? అభివృద్ధి అనేది స్థిరంగా సాగుతుందా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఉదాహరణకు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న మణికొండ, నార్సింగి నగరపాలక సంస్థలకు ఆస్తి పన్ను విపరీతంగా వస్తుంది. తుక్కుగూడ, జల్ పల్లి, జవహర్ నగర్ ప్రాంతాలు సరైన ఆదాయం లేకుండా ఇబ్బంది పడుతున్నాయి. వీటన్నిటిని హైదరాబాదులో కలిపితే నిధులు ఎలా ఖర్చు చేస్తారు? అనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తం అవుతుంది.హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉన్న గ్రామాలు ఇకపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం అవుతాయి.. వాటిని నగర అభివృద్ధిలో భాగస్వామ్యం ఎలా చేస్తారు? ఒకవేళ చేస్తే ఏం పద్ధతి పాటిస్తారు? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. గ్రామీణ వాతావరణం పట్టణ వాతావరణంతో పోల్చి చూస్తే భిన్నంగా ఉంటుంది. అలాంటప్పుడు విలీన గ్రామాలలో అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళిక ఉండాలి.హైదరాబాద్ నగరం అతి పెద్దది అయినప్పటికీ.. ప్రాంతాల ఆధారంగా జనసాంద్రత ఉంటుంది. ఉదాహరణకు పెద్ద అంబర్పేట్, తుక్కుగూడ, ఘట్కేసర్ ప్రాంతంలో జనసాంద్రత తక్కువగా ఉంటుంది. నార్సింగి, మణికొండ ప్రాంతాలలో జనసాంద్రత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి అప్పుడు ఈ ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేస్తున్నప్పుడు అధికారులు జనాభాను, ఇతర విషయాలను లెక్కలోకి తీసుకోవాల్సి ఉంటుంది.పునర్విభజన గతంలోనే అనేక అలజడులను సృష్టించింది. త్వరలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో కచ్చితంగా డివిజన్ల పునర్విభజన చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు అధికారులు ఎలాంటి విధానాన్ని పాటిస్తారు.. వివాదాలు లేకుండా ఎలా పరిష్కరిస్తారు.. అనేక ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది. మహా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆలోచన గొప్పగానే ఉన్నప్పటికీ.. దాని ఆచరణ సాధ్యమైతేనే ఆ నిర్ణయానికి సార్థకత లభిస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు.

## సంపాదకీయం

# బాలబానిసత్వానికి అడ్డుకట్టపడేనా!


ఇష్టం లేని పనిని వివిధ కారణాల వల్ల బలవంతంగా చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేయడమే బానిసత్వం. పిల్లలవద్ద బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతపు పెళ్ళిళ్ళు, ఇళ్ళల్లో వెట్టి చాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపు వృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. భయ పెట్టీ, హింసించి, మోసగించి, బెదిరించి, వివిధ రకాలుగా శ్రమ దోపిడీ జరగడం అనునిత్యం జరుగుతున్నదే. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి జరిగితే తప్ప పరిష్కారం లేదని విజ్ఞుల భావన. ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హెూటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ - ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధిం చింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశిం చింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవ త్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్ర మాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

# రాజకీయ దురంధరుడు మర్రి చెన్నారెడ్డి



మర్రి చెన్నారెడ్డి (జనవరి 13, 1919 – డిసెంబర్ 2, 1996) భారత జాతీయ కాంగ్రేసు పార్టీకి చెందిన రాజకీయ నాయకుడు. 1978 నుండి 1980 వరకు, 1989 నుండి 1990 వరకు రెండు పర్యా యాలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గా (1974–1977), పంజాబ్ గవర్నర్ (1982–1983), గవర్నర్‌గా కూడా పనిచేశారు. ఫిబ్రవరి 1992 నుండి మే 1993 వరకు రాజస్థాన్, 1993 నుండి ఆయన మరణించే వరకు తమిళనాడు గవర్నర్‌గా ఉన్నారు . అతను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు .అతి పిన్న వయస్కుడైన మంత్రులలో ఒకరైన ఘనత కూడా ఆయనకు ఉంది. 30 సంవత్సరాల వయస్సులో ఆంధ్ర ప్రదేశ్ మంత్రి కావడం కూడా విశేషం. చెన్నారెడ్డి జనవరి 13, 1919న ప్రస్తుత వికారాబాదు జిల్లా, వికారాబాదు తాలూకాలోని మార్పల్లి మండలం లోని సిరిపురం గ్రామములో శంకరమ్మ, లక్ష్మారెడ్డి దంపతులకు జన్మించారు. హైస్కూలు విద్యార్థిగా వున్న రోజులలో, ఉపన్యాస పోటీలను ఏర్పాటు చేయడం, గ్రంథాల యాలను స్థాపించడం, సేవాకార్య క్రమాలను నిర్వహించి, తోటి విద్యార్థులను ఉత్తేజ పరిచేవారు. కాలేజీలో చదువుతున్న రోజులలో సాంఘిక సేవా దళాలను ఏర్పాటు చేసి వాటికి నాయకత్వం వహించడమో, లేదా నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగే రాజకీయ మహా సభలలో ప్రతినిధిగా పాల్గొనడమో చేస్తూ ఉండేవారు. చిన్ననాటినుండి వైద్యవృత్తిని చేబట్టాలనే ఆకాంక్ష బలంగా ఉండేది. చివరకు తన 22వ ఏట ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.యస్ పట్టా తీసుకొనడం ద్వారా ఆయన ఆశయం సిద్ధించింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖలో వైద్యులుగా నియమింప బడ్డారు. ఉద్యోగంలో ప్రవేశించిన రెండు నెలలలోనే ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాదు లో స్వతంత్రంగా రెండు వైద్యాల యాలను నెలకొల్పి వైద్యం చేయడం ప్రారంభించారు. రెండు సంవత్సరాలకు ఆ రెండు చికిత్సాలయాలను మూసివేసి, తన జీవితాన్ని పూర్తిగా దేశ రాజకీయాలకు అంకితం చేశారు. గాంధీజీ పిలుపు మేరకు 1935లో ఆంధ్రమహాసభలో పాల్గొన్నారు. అది ఆయన రాజకీయ అరంగేట్రం. కార్యకర్తగా, సమావేశకర్తగా, ఖాదీ ప్రచారకులుగా, గాంధేయులుగా, విద్యార్థి నాయకులుగా, ఆంధ్ర విద్యార్థి కాంగ్రెస్ వ్యవస్థాపకులుగా అనేక స్థాయిల్లో పనిచేసి అనుభవాన్ని సంపాదించారు. 1938లో జైలు శిక్షను అనుభవించారు. చెన్నారెడ్డి 1941లో ఎం.బి.బి.ఎస్ డిగ్రీ పొందారు. వరంగల్ లోని గాంధీ ఆసుపత్రిలో డాక్టర్ గా పని చేశారు. తర్వాత రోజుల్లో ఆంధ్ర యువజన సమితి, విద్యార్థి కాంగ్రెసును స్థాపించారు.అనేక విద్యార్థి, యువత, విద్యా, అక్షరాస్యత, సాంస్కృతిక సంస్థలలో చురుకుగా పాల్గొనేవారు.ఒక వారపత్రికకు రెండు సంవత్సరాల పాటు సంపాద కత్వము వహించారు. అనేక పత్రికలలో వ్యాసాలు కూడా ప్రచురించారు. చెన్నారెడ్డి అప్పటి హైదరాబాదు రాష్ట్రములోని స్వాతంత్ర్యోద్యమములో పాల్గొన్నారు. 1942లో ఆంధ్ర మహాసభ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1946 లో జరిగిన రాష్ట్ర స్టేట్ కాంగ్రెసు మహాసభకు చెన్నారెడ్డి ఆహ్వాన సంఘ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. చివరకు ఈ స్టేట్ కాంగ్రెసు అధ్వర్యాన్నే, హైదరాబాద్ ప్రజలు నిజాం నిరంకుశ పరిపాలనను ఎదుర్కొని పోరాడారు. నిజాం మీద సాగించిన ఈ పోరాటాన్ని అహింసాయుత పద్ధతిని సాగించాలని డాక్టరు చెన్నారెడ్డి అభిమతం. ఆ సందర్భంలో ఆయన ఢిల్లీ వెళ్ళి పండిట్ జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులను కలుసుకుని వచ్చారు. మహాత్మాగాంధీ. ఆశీస్సులను కూడా పొందారు. ఆయన అనేక సంవత్సరాలు ఆంధ్రా ప్రావిన్స్ కాంగ్రెస్ కమిటీకి ప్రధాన కార్యదర్శిగా, 30 సంవత్సరాలు పిసిసి వర్కింగ్ కమిటీ సభ్యునిగా ఉన్నారు. హైదరాబాదు స్వతంత్ర్య పోరాటం ఉధృత రూపం దాల్చడంతో, నిజాం ప్రభుత్వం నాయకులందరినీ అరెస్టు చేసింది. అరెస్టు అయిన నాయకులలో చిన్నవాడైన చెన్నారెడ్డి కూడా ఉన్నారు. చర్చల ఫలితంగా విడుదలై, స్టేట్ కాంగ్రెస్ నాయకులందరు హైదరాబాదు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు వలస వెళ్ళి, అక్కడనుండి ఉద్యమం సాగించారు. ఆ సమయంలో చెన్నారెడ్డి విజయవాడ వచ్చి, “హైదరాబాదు” అనే వారపత్రికను నిర్వహిస్తూ, హైదరాబాదు ప్రజలు సాగిస్తున్న స్వాతంత్ర్య పోరాటాన్ని ఉధృతపరిచారు. ఆ సమయంలో భారత ప్రభుత్వం కలుగజేసుకుని నిజాంపై పోలీసు చర్యలను తీసుకుని, హైదరాబాదు సంస్థానాన్ని ఇండియాలో అంతర్భాగంగా విలీనం చేసింది. దానితో ఇండియా పార్లమెంటుకు హైదరాబాదు రాష్ట్రంలోని కొందరిని ప్రజా ప్రతినిధులుగా భారత ప్రభుత్వం తీసుకొనడం జరిగింది. ఆనాటి పార్లమెంటు సభ్యులలో చెన్నారెడ్డి కూడా ఒకరు. పార్ల మెంటులో హైదరాబాదు లోని విషమ సంఘటనలను, పరిస్థితులను గురించి చెన్నారెడ్డి చేసిన ప్రసంగాలు నెహ్రూ, రాజాజీల వంటి వారిని ఆకర్షించాయి. పర్యవసానంగా చెన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ విప్‌గా ఎన్నుకో బడ్డారు. ఇంతలో 1952లో దేశమంతటా ప్రప్రథమంగా వయోజన వోటింగు పద్ధతిని జనరలు ఎన్నికలు జరిగాయి. చెన్నారెడ్డి హైదరాబాదు రాష్ట్ర శాసన సభకు ఎన్నుకో బడ్డారు. తర్వాత బూర్గుల మంత్రివర్గంలో ఆహార, వ్యవసాయ శాఖలమంత్రిగా తీసుకోబడి, ఇండియన్ డెలిగేషనుకు నాయకత్వం వహించి, 1953, 1955 సంవత్సరాలలో విదేశాలు పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగిన తర్వాత సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గాలలో కూడా చెన్నారెడ్డి మంత్రిగా పనిచేశారు. ఆంధ్ర రాష్ట్రంతో తెలంగాణ విలీనాన్ని వ్యతిరేకించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెద్ద మనుషుల ఒప్పందంపై సంతకం చేసిన తెలంగాణ ప్రాంత నేతలలో ఒకరు . డాక్టర్ రెడ్డి 1967 లో ఇందిరా గాంధీ కేంద్ర మంత్రివర్గంలో ఉక్కుశాఖా మంత్రిగా తీసుకోబడ్డారు. ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణ ప్రజలు సాంఘిక ఆర్థిక విద్యా రంగాలలో వెనుకబడి యుండడాన్ని డాక్టరు చెన్నారెడ్డి సహించలేక పోయారు. ఏప్రిల్ 1968 లో కేంద్ర మంత్రివర్గం నుండి రాజీనామా చేసారు. 1968లో ఢిల్లీ నుండి హైదరా బాదుకు తిరిగి రాగానే “తెలంగాణ ప్రజా సమితి” అనే పార్టీని నెలకొల్పి, ప్రత్యేక తెలంగాణ నిర్మాణం కొరకు పోరాటం సాగించారు. ఉద్యమాన్ని రాజకీయం చేసేందుకు చెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడయ్యారు. విభజనకు మద్దతిచ్చే ఆ పార్టీ 11 లోక్‌సభ స్థానాలను (14 స్థానాల్లో) గెలుచు కోవడం ద్వారా ప్రజా ఆదరణ పొందింది. ఉత్తర ప్రదేశ్ (1970ల మధ్యలో రాష్ట్రపతి పాలన సమయంలో), రాజస్థాన్, పంజాబ్, తమిళనాడు మరియు పాండిచ్చేరి గవర్నర్‌గా కూడా ఉన్నారు. 1971లో సిక్స్ పాయింట్ ఫార్ములా రూపొందించిన ఘనత ఆయనదే. 1972లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ‘న్యూ డీల్ ఫర్ తెలంగాణ’గా చేర్చారు. డాక్టరు చెన్నారెడ్డి శక్తి సామర్థ్యా లను గుర్తించిన ఇందిరా గాంధీ, ఆయనను ఉత్తరప్రదేశ్ గవర్నరుగా నియమించగా, 1974 అక్టోబరు 24వ తేదీన పదవీ స్వీకారం చేశారు. 1977 అక్టోబరులో గవర్నరు పదవివి రాజీనామా చేసి హైదరాబాదుకు తిరిగి వచ్చారు. దేశ పరిస్థితులను, వివిధ రాజకీయ పక్షాల తీరు తెన్నులను పరిశీలిం చారు. చివరకు కాంగ్రేసు (ఐ) పార్టీని తమ పార్టీ గా నిర్ణయించు కున్నారు. 1978 జనవరి 18 వ తేదీని రాష్ట్రకాంగ్రేసు (ఐ) అధ్యక్ష పదవిని స్వీకరించారు. 1978 ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో డాక్టరు చెన్నారెడ్డి కృషి వలన కాంగ్రెస్ (ఐ) పార్టీ 180 స్థానాలు గెలుచు కొన్నది. అత్యధిక సంఖ్యాబలం గల కాంగ్రెస్ (ఐ) పార్టీ తరుపున డాక్టరు చెన్నారెడ్డి గారు 1978 మార్చి 6వ తేదీని ముఖ్యమంత్రి పదవిని అలంక రించారు. డిసెంబర్ 2,1996న చెన్నారెడ్డి మరణించారు. చెన్నారెడ్డి సమాధి హైదరాబాదులో ఇందిరాపార్కు ఆవరణలో ఉంది.

# కాలుష్యం మానవ మనుగడకు సవాలే!



సరిగ్గా 40 ఏళ్ల క్రితం 1984 డిసెంబర్ 2న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నగరంలో ఒక ఫ్యాక్టరీలో నుంచి వెలువడిన విష వాయువులు వేలాది మంది ప్రాణాలను క్షణాలలో బలి గొన్నాయి. ఈ ఘోర కలిని అందరూ గుర్తుంచుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 2ను ‘జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం’గా ప్రకటించింది. 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి సమయంలో భోపాల్ నగరం గాఢ నిద్రలో ఉన్న సమయంలో 41 టన్నుల మిథైల్ ఐసోసైనేట్ అనే విష వాయువు లీక్ కావడం వలన నిమిషాల వ్యవధి లోనే 2259 మంది అమాయక ప్రజలు మరణించారు. మరో 72 గంటల్లో 3487 మంది అసువులు బాశారు. అనంతరం ఈ దుర్ఘటన వల్ల 8 నుంచి 10 వేల మంది, మొత్తంగా 25,000 మంది ఈ గ్యాస్ లీకేజీ వలన ఉత్పన్నమైన పరిణామాలతో మరణించినట్లు మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. అంతే కాకుండా పరోక్షంగా 500,000 పైగా ప్రజలు ఈ దుర్ఘటన వలన ఏర్పడిన అనారోగ్యాల బారిన పడ్డారు. ఇది ప్రపంచం లోనే అతిపెద్ద పారిశ్రామిక కాలుష్య ఘోరకలి. దీని కారణంగా కొందరుఇంకా చికిత్సలు పొందు తూనే ఉన్నారు. ప్రపంచ విషయానికి వస్తే యునైటెడ్ కింగ్డం చరిత్రలో అత్యంత భయంకరమైన కాలుష్య సంఘటన లండన్ పై డిసెంబరు 4 1952 న ఏర్పడిన మహా స్మోగ్ రూపంలో జరిగింది. కేవలం 6 రోజులలో 4000 మంది చని పోయారు, తరువాతి మాసాలలో 8000 చని పోయారు. 1979 లో యు ఎస్ ఎస్ ఆర్ లోని స్వేర్డ్ లోవ్స్క్ దగ్గర ఒక బయలాజికల్ ఆయుధాల ను తయారు చేసే లాబొరేటరీలో జరిగిన ప్రమాదం లో లీక్ అయిన ఆంత్రాక్స్ స్పోర్ల వలన వందలమంది సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికాలో నేటి వరకు అతి పెద్ద కాలుష్య ప్రమాదము 1948 సంవత్సరం అక్టోబరు చివర్లో దోనోర, పెనన్ పెనన్ సిల్ వెనియా లో జరిగింది. దీనివలన మొత్తం 20 మంది మృతిచెందగా 7000 పైగా క్షత గాత్రులయ్యారు. పరిశ్రమల నుంచి, వాహనాల నుంచి వచ్చే వ్యర్థాలు గాలిని, నీటిని, భూమిని, అంతరిక్షాన్ని అన్నింటిని కాలుష్యం చేస్తున్నవి. కర్బన ఉద్గారాల వల్ల భూతాపం పెరిగి పోతున్నది. భూగోళం అగ్నిగోళంగా మారు తోంది. ప్రస్తుతం ఉన్న రీతిలోనే వాతావరణ కాలుష్యం పెరిగితే ఈ శతాబ్దపు అంతానికి భూ తాపం 3.5 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగి ప్రళయ విలయాలు సంభవించి జీవుల మనుగడ కష్టమవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పరిసరాల కాలుష్యం నేడు మనిషి మనుగడకే ప్రమాదం కలిగించే స్థాయికి చేరుకున్నది. వాయు కాలుష్యములు ఎక్కువగా ఉన్న ప్రపంచ పట్టణాలలోని పిల్లలు ఉబ్బసం, నిమోనియా, ఇతర శ్వాసకోస సంబంధమైన జబ్బుల బారిన పడే అవకాశాలు ఎక్కువ. వాయు కాలుష్యం సామాన్యముగా జనసాంద్రత అధికంగా కలిగిన మహా నగరాలలో, ముఖ్యముగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, ఎక్కడైతే పర్యావరణ నియమ నిబంధనలు అమలులో లేవో లేక నామమాత్రంగా వున్నాయో, అక్కడ కూడు కొంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడా జన సాంద్రత అధికంగా కలిగిన ప్రదేశాలలో కాలుష్యం అనారోగ్య కరమైన స్థాయిలలో ఉంటుంది. వాయుకాలుష్యం, నీటి కాలుష్యం, భూ కాలుష్యం, ధ్వని కాలుష్యం, సముద్ర కాలుష్యం, ఉష్ణ కాలుష్యం, వ్యర్థ ఘన పదార్థాల కాలుష్యం, రేడియో ధార్మిక కాలుష్యం తదితరాలు కూడా కాలుష్య కారకాలు. కాలుష్య కారకాలు ఉత్పన్నమగు విధానాలు ప్రకారం రెండు రకములుగా విభజింపవచ్చు - ప్రాథమిక లేదా ద్వితీయ రకాలు. సాధారణంగా ప్రాథమిక కాలుష్య కారకాలు ఏదైనా ప్రక్రియ నుండి నేరుగా ఉత్పన్నమైయ్యే పదార్థాలు. ఉదాహరణకు అగ్ని పర్వతముల నుండి వచ్చే బూడిద, మోటారు వాహనముల నుండి వచ్చే కార్బన్ మోనాక్సైడ్ లేక ఫ్యాక్టరీ ల నుండి వచ్చే సల్ఫర్ డై ఆక్సైడ్ లాంటివి. ద్వితీయ రకపు కాలుష్య కారకాలు నేరుగా ఉత్పన్నం కావు. ప్రాథమిక కాలుష్య కారకాలు చర్యలకు లోనవ్వడం వల్ల లేక వాయువులో కలిసినందు వల్ల ద్వితీయ కాలుష్య కారకాలు ఏర్పడుతాయి. పర్యావరణాన్ని రక్షించటా నికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దు ష్ప్రభావాలను తగ్గించ టానికి వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య భూతాన్ని తరిమి వేయడానికి పలు చట్టాలను రూపొందించి అమలు చేస్తున్నాయి. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో “వాయు కాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఇంకా 1986వ సంవత్సరంలో “పర్యా వరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విష వాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణం లోకి వదలాలి. అంతేకాక ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణు రియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్ళు, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజిం చింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపు వర్గంగా వర్గీకరించింది. తెలంగాణ లోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒక వేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది.

# శిక్షణలో మెరిసిన మెదక్ పోలీస్ కానిస్టేబుల్ ప్రశాంత్‌కు సన్మానం

- ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్

మెదక్ జిల్లా, ప్రతినిధి బాలా గౌడ్ (శుభోదయం న్యూస్):

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి మొయినాబాద్‌లో శిక్షణ పొందిన 51మంది పోలీసు సిబ్బందిలో మెదక్ జిల్లా నుండి ముగ్గురు కానిస్టేబుళ్లు ప్రదీప్, ప్రశాంత్, రాకేష్ లు పాల్గొన్నారు. ఈ శిక్షణలో కానిస్టేబుల్ ప్రశాంత్ ఫైరింగ్ మరియు విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరచి, ట్రైనింగ్ ప్రిన్సిపాల్ చేత మెడల్ పొందడం జరిగింది. ఈ సందర్భంగా మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ గారు ప్రశాంత్‌ను సన్మానిస్తూ సర్టిఫికెట్ మరియు మెడల్ అందజేశారు.ఎస్పీ గారు మాట్లాడుతూ ప్రశాంత్ ప్రదర్శించిన ప్రతిభ మెదక్ జిల్లా పోలీస్ శాఖకు గర్వ కారణమని, ఇటువంటి శిక్షణా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరచే సిబ్బందిని జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని అన్నారు. యువ సిబ్బంది కృషి, నిబద్ధత భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు సాధించడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కు



జిల్లా ఎస్పీ గారు ప్రత్యేక రివార్డు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ గారు, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఆర్ఎసైలు నరేష్, భవానీకుమార్, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు రవాణా సౌకర్యం కల్పించాలి కలెక్టరేట్ ఏఓ కి వినతిపత్రం

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్(శుభోదయం న్యూస్):



జిల్లా కేంద్రంలోని ఎంజీఓస్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని సుమారు 50 మంది విద్యార్థినులు ఎస్సీ,ఎస్టీ ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు.సుమారు 2 కిలోమీటర్ల దూరం నిత్యం ఉదయం,సాయంత్రం పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్నారు,మార్గమధ్యంలో సాయంత్రం రద్దీగా ఉండే రోడ్డు ని దాటుకుని వేళ్ళాల్సి వస్తుంది.ఆ సమయంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుది కావున ప్రాథమిక స్థాయిలో ఉన్న విద్యార్థినిలకు బద్రతా దృష్ట్యా ఇబ్బందులు ఉన్నందువల్ల రవాణ సౌకర్యం కల్పించాలని ప్రజావాణిలో ఏవో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.విద్యార్థుల భద్రతా దృష్ట్యా సంబంధిత రవాణా అధికారులు వెంటనే స్పందించి రవాణ సౌకర్యం కల్పించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు,టీజెఎస్ జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సభావత్ వినోద్ చౌహన్ పాల్గొన్నారు.

## సూతారిపల్లి కాంగ్రెస్ అభ్యర్థి ఏలీయా భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు

రామాయంపేట(శుభోదయం న్యూస్):



మెదక్ జిల్లా రామాయంపేట మండలం సూతారిపల్లి గ్రామంలో సర్పంచ్ పదవికి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఏలీయా సోమవారం నాడు సుమారుగా 200 మంది కార్యకర్తలతో భారీ ర్యాలీతో ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని నామినేషన్ అట్టహాసంగా దాఖలు చేశారు.నామినేషన్ సమర్పించిన అనంతరం ఏలీయా మాట్లాడుతూ గ్రామ ప్రజలు నాపై ఉంచిన విశ్వాసమే నాకు బలం.నన్ను అభ్యర్థిగా నిలబెట్టడంలో సహకరించిన గ్రామస్థులు,మన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.సర్పంచ్‌గా గెలిచిన పక్షంలో గ్రామ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పారదర్శక పాలన అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గజవాడ నాగరాజు,మహేందర్ రెడ్డి,దేమే యాదగిరి,చింతల స్వామి,దేవుని రంజిత్‌తో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పన్ను చెల్లింపు ప్రకటనలు అడ్డుకున్న స్థానికులు

ఘట్కేసర్ మండలం, రిపోర్టర్ శ్రీనివాస్ (శుభోదయం న్యూస్):

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ సత్య సాయి హౌసింగ్ కాలనీలో పన్నులు చెల్లించాలని ప్రకటన చేస్తున్న మున్సిపాలిటీ ఆటోను స్థానికులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు సామాన్యుల వద్ద, చిరు వ్యాపారుల వద్ద పనులు సమయానికి వసూలు చేస్తున్నారు. కానీ పేరు మోసిన శ్రీనిధి కళాశాల వంటి యజమాన్యాలు కోట్ల రూపాయల పనులు ఎగ్గొడుతున్న మున్సిపల్ అధికారులు, జిల్లా ఉన్నత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనిధి, రాక్ వుడ్ ఇతర పేరుమోసిన బడా విద్యాసంస్థలు ప్రభుత్వానికి కట్టాల్సిన పనులను కట్టినప్పుడే తాము కూడా మున్సిపల్ కి టాక్స్ లు చెల్లిస్తామని స్థానిక



ప్రజలు స్పష్టం చేశారు. సోమవారం చౌరస్తా వద్ద ఉన్న చిరు వ్యాపారులు, పోచారం గ్రామస్తులు, అడ్డుకొని మైకులను బందు చేయించారు. తక్షణమే జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రభుత్వానికి కట్టాల్సిన పన్ను ఎగ్గొడుతున్న పేరుమసిన విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రామాయంపేటలో ఘనంగా పోలీసు కిష్టన్న వర్ధంతి వేడుకలు

రామాయంపేట(శుభోదయం న్యూస్):

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో సోమవారం నాడు తెలంగాణ మలిదశ ఉద్యమ మొట్ట మొదటి అమరవీరుడు పోలీసు కిష్టన్న ముదిరాజ్ 16వ వర్ధంతిని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామాయంపేట సీఐ వెంకట రాజాగౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా పోచమ్మల అశ్విని శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఎక్కడ కూడా వెనకడుగు వేయకూడదని తెలంగాణను సాధించుకోవాలని తెలంగాణ నుంచి తరలిపోతున్న నీళ్ల నియామకాలు,నిధులు మన రాష్ట్రానికి రావలసిన పూర్తి మొత్తంలో మనకే చెందాలని ఏది ఏమైనప్పటికీ తెలంగాణ వస్తేనే తెలంగాణ ప్రజల బ్రతుకులు బాగుపడతాయని తలంచి,తనకి అన్నీ కూడా అనుకూలంగా ఉన్నప్పటికీ స్వరాష్ట్రమే ధ్యేయంగా భావించిన పోలీసు కిష్టన్న తన గన్నుతో తనను తాను కాల్చుకొని జై తెలంగాణ అనే నినాదం మారు మ్రోగేలా గట్టిగా అరచి తన తుది శ్వాసను



విడిచారన్నారు.నేటి యువత పోలీసు కిష్టన్నను ఆదర్శంగా తీసుకొని మన రాష్ట్రాన్ని మనం అభివృద్ధి పథంలో నడిచేలా చేయాలని,అట్టడుగు స్థాయి వరకు రాజ్యాధికారం అందినప్పుడే అమరవీరులు కలలు కన్న తెలంగాణ సిద్ధించినట్టన్నారు.ఈ కార్యక్రమంలో కోటి యుగంధర్ రావు యెనిశెట్టి అశోక్,దేమే యాదగిరి,సుందర్ సింగ్,పోచమ్మల సిద్ధరాములు,తౌంటవాలి యాదగిరి, సుంకోజు దామోదర్ చారి,అల్లాడి వెంకటేష్,సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత నామినేషన్ ప్రక్రియపై సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు, ఐపీఎస్

మెదక్ జిల్లా, ప్రతినిధి బాలా గౌడ్(శుభోదయం న్యూస్):



పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ దాఖలు ప్రక్రియలో భాగంగా భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్ఠం చేయడానికి మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ గారు ఈ రోజు స్వయంగా పర్యటించి పరిశీలిచారు. ఈ సందర్భంగా మెదక్, శంకరంపేట్ ఆర్, రామాయంపేట్ మండలాల్లోని ఎంపిడిఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి, అక్కడ అమలులో ఉన్న భద్రతా చర్యలు, పోలీసులు నిర్వహిస్తున్న బందోబస్తు విధులు, పర్యవేక్షణ వ్యవస్థలను సమగ్రంగా పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద రద్దీ తదితర అంశాలను గమనించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ప్రశాంతంగా సాగేందుకు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి అనవసర గుంపులు, గొడవలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు అధికారులకు, సిబ్బందికి ఆదేశించారు. ఎన్నికల నామినేషన్ నుండి పోలింగ్ వరకు ప్రతి దశలో శాంతి భద్రతల పరిరక్షణ అత్యంత ప్రాధాన్యతగల విషయమని, దీనిలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఎస్పీ గారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారి వెంట తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్బి సీఐ సందీప్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు

## నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ బృందాల తనిఖీ

పాపన్నపేట మండలం(శుభోదయం రిపోర్టర్ ఎం రవీందర్):




మండల కేంద్రం పాపన్నపేటలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ బృందాలు సోమవారం పలు చోట్ల తనిఖీలు నిర్వహించాయి.ప్రయాణ ప్రాంగణ ప్రాంతం, ప్రధాన చౌరస్తా, దుకాణాల్లో సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించేందుకు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.కానిస్టేబుళ్లు, తదితరులున్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి ఎస్సై సార శ్రీనివాస్ గౌడ్

పాపన్నపేట, మండలం, రిపోర్టర్ ఎం రవీందర్(శుభోదయం న్యూస్):



పాపన్నపేట మండలంలో ఈనెల 11న జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఎన్నికలలో ఎవరైనా కోడ్ ను ఉల్లంఘించిన, అధికారుల విధులకు ఆటంకాలు కలిగించిన చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు ప్రజలు అధికారులకు సహకరించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ప్రజలు ఇరు పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ సార శ్రీనివాస్ గౌడ్ కోరారు. అలాగే ఓటర్లను మభ్య పెట్టేందుకు అభ్యర్థులు డబ్బులు, మద్యం పంపిణీ చేసే చట్టరితే నేరమని అన్నారు. ప్రజలు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## నేటి నుండి ఎన్.టి.పి.సి ఉన్నత పాఠశాలలో ఇన్ స్పైర్, జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక జంట ప్రదర్శనలు ఏర్పాట్లను పరిశీలించిన డి.ఇ.ఓ జి. శారద

గోదావరిఖని టౌన్, రిపోర్టర్ (శుభోదయం న్యూస్):

జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన (2025–26),ఇన్ స్పైర్ అవార్డ్స్ మనాక్ (2024–25)జంట ఎగ్జిబిషన్ లను 2,3,4 తేదీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్.టి.పి.సి రామగుండంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద సోమవారం తెలిపారు.ఈ మేరకు ఆమె సోమవారం పాఠశాలలోని ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలోని అన్నీ యాజమాన్యాలలోని ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల నుండి డి.ఎల్.బి.వి.పిలోని 7 ఉప అంశాలకనుగుణంగా జూనియర్(6–8తరగతుల విద్యార్థులు), సీనియర్ (9–12తరగతుల విద్యార్థులు) విభాగాలలో సమాజహిత, వినూత్న ప్రాజెక్టులతో హాజరుకావాలని డి.ఇ.ఓ పేర్కొన్నారు.అలాగే జిల్లా నుండి గత విద్యా సంవత్సరం ఎంపిక కాబడిన 106 ఇన్ స్పైర్ అవార్డ్స్ మనాక్ ప్రాజెక్టుల విద్యార్థులు సైతం ఇందులో పాల్గొని తమ ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తారని ఆమె తెలిపారు. మండల విద్యాధి కారులు ప్రదానోపాధ్యాయులు,గైడ్ టీచర్స్ తమ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించి నాణ్యమ్మైన ఆవిష్కరణలను ప్రదర్శించేలా తగు రీతిలో సహాయ సహకారలనందించాలన్నారు.ఇన్ స్పైర్ అవార్డులకు ఎంపికైన ప్రతి విద్యార్థి తప్ప కుండా ఈ మూడు రోజుల వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేలా ప్రదానోపాధ్యాయులు తగు చర్యలు గైకొనాలని డి.ఇ.ఓ పేర్కొన్నారు.డి.ఎల్.బి.వి.పిలో భాగంగా 'స్టెమ్ ఫర్ వికసిత్



ఆత్మనిర్బర్ భారత్' ప్రధాన ఇతివృత్తంగా సుస్థిర వ్యవసాయం,వ్యర్థ పదార్థాల నిర్వహణ ప్లాస్టిక్స్ కు ప్రత్యామ్నాయాలు,గ్రీన్ ఎనర్జీ,అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వినోదభరితమైన గణిత నమూనాలు, ఆరోగ్యం పరిశుభ్రత,నీటి సంరక్షణ నిర్వహణ ఉప అంశాల్లో విద్యార్థులు తమ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించాలని తెలిపారు. అలాగే "ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం"అనే అంశంపై విద్యార్థులు సెమినార్ లో పాల్గొనాలని డి.ఇ.ఓ పేర్కొన్నారు.ఇందులో డి.సి.ఇ.బి కార్యదర్శి వి. హన్మంతు,మండల విద్యాధి కారులు జి.మల్లేశం, టి. సురేందర్, టి.విమల, ప్రదానోపాధ్యాయులు సి.హెచ్ ఆగయ్య,స్వర్ణలత, పలు కమిటీలకు చెందిన ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం డి.ఇ.ఓ జి.శారద ఎన్.టి.పి.సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంతను కలిసి ఎగ్జిబిషన్లకు ఆహ్వానించారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్ నగేష్

రామాయంపేట(శుభోదయం న్యూస్):

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నాడు నామినేషన్ స్వీకరణ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలన్నారు.నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు.దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిటులను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ,జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలన్నారు.ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని,నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్న అధికారులను సంప్రదించాలని సూచించారు.అయన వెంట స్థానిక మండల ఎంపీడీవో శాజీలోద్దీన్,తహసిల్దార్ రజనీకుమారి ఎస్సై బాలరాజ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వాజేడు- వెంకటాపురం, భద్రాచలం ప్రధాన

**రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలి**

ములుగు జిల్లా, రిపోర్టర్ నారాయణమూర్తి (శుభోదయం న్యూస్):



ములుగు జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేసిన ఎన్ హెచ్ ఆర్ సి. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య వెంకటాపురం నూగూరు ములుగు జిల్లా వాజేడు వెంకటపురం మండలాలలో భద్రాచలం ప్రధాన రహదారి గుంతల మయమైందని వెంటనే పూడ్చి మరమతు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య ములుగు జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. వెంకటాపురంలో మండల అధ్యక్షులు రాయుడు జయరాజు అధ్యక్షతన జరిగిన ఎన్ హెచ్ ఆర్ సి. ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే ఇసుక క్వారీలు ఉన్న ప్రదేశంలో ఒకపక్క ఆదాయం వచ్చినప్పటికీ ప్రజలు బాధపడే విధంగా రోడ్లు ఉండడం దురదృష్టకరమని ఆయన అన్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా ప్రయాణించడానికి వీలు లేని స్థితిలో రోడ్లు ఉన్నాయని ఆయన అన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ములుగు జిల్లా కలెక్టర్ ఈ అంశంపై ప్రత్యేక చొరవ చూపాలని ఆయన కోరారు. ఇలాంటి దుర్భరమైన రోడ్లపై పర్యవేక్షణ చేయకుండా, మరమ్మత్తు కోసం ప్రభుత్వానికి రిపోర్ట్ చేయకుండా జాప్యంగా వ్యవహరించే రోడ్డు భద్రత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రజల సౌకర్యార్థం అధికారులు పనిచేయాలని, ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గోగులమూడి హరికృష్ణ, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నగుండ్ల వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం సుభాషిని, మండల ప్రధాన కార్యదర్శి పద్మ, వాజేడు, వెంకటాపురం మండల నాయకులు లూర్దు రాజు, రామకృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కలపల్లి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వడ్లకొండ వెన్నెల

రామగుండం మండలం, రిపోర్టర్ (శుభోదయం న్యూస్):

ఎల్కలపల్లి గ్రామ పంచాయతీ లో ఈసారి సర్పంచ్ ఎన్నికలు కొత్త దారిలో సాగనున్నాయి. చదువుకుని మంచి ఉద్యోగం దొరకక పోవడంతో నిరుత్సాహ పడకుండా, తిరిగి గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ముందు కొచ్చిన వడ్లకొండ వెన్నెల సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతోంది..కులాంతర వివాహం చేసుకొని సామాజిక అవరోధాలను చెరిపేసిన వెన్నెల, చదువు ఉన్న యువత గ్రామానికి ఎలా తోడ్పడాలని ఆలోచించాలనే సందేశంతో రాజకీయ రంగంలో అడుగుపెట్టింది. నిరుద్యోగులు, మహిళలు, రైతుల సమస్యలన్నీ దగ్గరగా చూసిన వెన్నెల, ప్రజాప్రతినిధిగా గ్రామాభివృద్ధి కోసం కృషి చేయాలనే సంకల్పంతో ఈరోజు నామినేషన్ వేశారు. గ్రామంలో యువత, మహిళలు,విద్యావంతుల్లో వెన్నెలకి మంచి స్పందన కనిపిస్తోంది. స్వచ్ఛమైన రాజకీయాలకు ప్రతీకగా, అభిలాషలతో కాక అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వస్తున్న వెన్నెల అభ్యర్థిత్వంతో ఎల్కలపల్లిలో ఎన్నికల ప్రచారం మరింత రసవత్తరంగా మారింది.




# రామగుండంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు పునరుద్ధరణ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

రామగుండం మండలం, రిపోర్టర్ (శుభోదయం న్యూస్):

రామగుండం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం గత రెండు సంవత్సరాలుగా జరుపుతున్న కృషిని మరో ముందడుగుకు తీసుకెళ్లినట్లు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఈ విషయం పై అనేకసార్లు సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్మోహన్ నాయుడుని ప్రత్యక్షంగా కలిసి మాట్లాడిన విషయాన్ని ఎంపీ గుర్తుచేశారు. మొదట ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిశీలించిన సైట్‌లో కొండలు ఉండటం, అడ్డంకులు ఉండటం వల్ల వారు ఆ లొకేషన్‌ను రిజెక్ట్ చేశారు.కానీ మేము మళ్లీ వారిని ఒత్తిడి చేసి, ప్రీ- ఫీజిబిలిటీ స్టడీని కొత్త లొకేషన్‌పై నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం.రేవంత్ రెడ్డి నాయకత్వం లో రూ. 50 లక్షలు ప్రీ-ఫీజిబిలిటీ స్టడీ కోసం సెంటర్‌కు చెల్లించినట్లు ఎంపీ తెలిపారు. ఈ స్టడీని వేగవంతం చేయడానికి ఈరోజు కూడా సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీలో మంత్రి రామ్మోహన్ నాయుడును మరోసారి కలిసి చర్చలు జరిపినట్లు వంశీకృష్ణ వెల్లడించారు.వారు నాకు హామీ ఇచ్చారు డిసెంబర్ 3 లేదా 4 తేదీలలో ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా టీమ్ రామగుండం ప్రాంతాన్ని సందర్శించి, కొత్త ల్యాండ్ సర్వే చేస్తుంది. ప్రీ-ఫీజిబిలిటీ స్టడీ పూర్తయ్యాక భూసేకరణ, తుది నిర్ణయాలకు వెళ్లే అవకాశం ఉంటుంది," అని ఎంపీ చెప్పారు.ఎయిర్పోర్ట్ స్థాపన వల్ల రామగుండం, సింగరేణి ప్రాంతం, పెద్దపల్లి, మంచిర్యాల్,ఆదిలాబాద్ జిల్లాలు సహా మొత్తం పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని ఎంపీ వంశీకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఇది ఒక భారీ ఆర్థిక అవకాశాన్ని తీసుకొస్తుంది. అందరూ సహకరించాలి. మీ ఆశీర్వాదంతో రామగుండంలో ఎయిర్‌పోర్ట్ వచ్చేవరకు నేను నిరంతరం కృషి చేస్తాను, అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ చెప్పారు.



# వచ్చే నోటిఫికేషన్ లలో టైప్ రైటింగ్ పోస్టులు కేటాయించాలి

**టైప్ రైటింగ్ విజయోత్సవ సభలో టైపింగ్ గురువులకు సన్మానం**

**టైప్ రైటింగ్ ఉత్తమ విద్యార్థులకు ప్రశంస పత్రం నగదు పంపిణీ**

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని, ఘనంగా సన్మానించిన అధ్యక్షుడు సతీష్**

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్):

స్కిల్ యూనివర్సిటీ అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టైపింగ్ స్కిల్ ను కాపాడాలని, మల్కాజిగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర టైప్ రైటింగ్ సంస్థల చైర్మన్ మర్రిరాజశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బోయిన్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హాండ్ కంప్యూటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని, సీనియర్ టైపింగ్ గురువులను సన్మానించి, టైపింగ్ లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సర్టిఫికెట్ నగదుతో అధ్యక్షుడు సతీష్ తో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టైపింగ్ నైపుణ్యాన్ని ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కంప్యూటర్, కీ బోర్డు ను ఉపయోగించే వారు కూడా టైపింగ్ నైపుణ్యం ఉన్నవారే రాణించగలరని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం టైపింగ్ యొక్క ఆవశ్యకతను గుర్తించి వారిని ప్రోత్సహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఏ లు గా, స్టెనోలుగా తీసుకొనే వారికి టైపింగ్, షార్ట్ హాండ్ లో ఉత్తీర్ణత పొందిన వారికే ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా టైపింగ్ అర్హత తప్పనిసరి చేయాలన్నారు. తద్వారా తరతరాలుగా టైపింగ్ ఇన్ స్టిట్యూట్ లను నడిపిస్తూ వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న వారిని ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర టైప్ రైటింగ్ సంస్థల అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ... ప్రభుత్వ నోటిఫికేషన్లలో టైప్ రైటింగ్ కు పోస్టులు కేటాయించాలని, రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వం, శశిధర్, రామేశ్వరా చారి, రామారావు, వై. రాజేశ్వర్, ఫణి, రాధ, నాగశ్రీ, పద్మ, చంద్రయ్య, రాంప్రసాద్, మల్లయ్య, శ్రీనివాస్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాస రావు

రామాయంపేట(శుభోదయం న్యూస్):



మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని ఎంపీడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండో విడత నామినేషన్ పోలింగ్ కేంద్రాలను మరియు పోలీసుల బందోబస్తు విధులను సోమవారం నాడు జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాసరావు సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల వద్ద ప్రజల రద్దీ ఎక్కువగా ఉండకుండా పోలీసులు చూడాలని తెలిపారు.ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత ప్రాముఖ్యమని ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలింగ్ స్టేషన్లపై పోలీసులు దృష్టి సారించాలని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆయన వెంట మండల ఎంపీడీవో శాజీలోద్దీన్ తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్,స్థానిక సీఐ వెంకట రాజాగౌడ్,ఎస్సై బాలరాజ్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

## బ్రాహ్మణపల్లి పెద్ద తండా గ్రామపంచాయతీ ఏకగ్రీవం..

**కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నేనావత్ సురేఖ మరియు రవి**

పరిగి రిపోర్టర్(శుభోదయం ః):



దోమ మండలపరిధిలో ని బ్రహ్మణపల్లీ పెద్ద తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఖరారైంది. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులందరినీ కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రహ్మణపల్లీ పెద్ద తండా పంచాయతీ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయినటువంటి నేనవత్ సురేఖ భర్త రవి కి మరియు ఉప సర్పంచ్ గా జరుప్లా రమేష్ కి గ్రామ పెద్దలు యువకులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, ఎన్నికలు అవసరం లేకుండా స్వచ్ఛందంగా సర్పంచ్ గా ఎంపిక చేయడంతో పాటు 8 మంది వార్డు సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.ఈ ఏకగ్రీవానికి సహకరించిన పెద్ద తండా గ్రామపంచాయతీ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.....

## పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ లో భారీ చేరికలు


బీర్కూర్ మండలం, రిపోర్టర్(శుభోదయం న్యూస్):



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అధ్వర్యంలో బీజేపీ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి చేరికలు వర్ని మండల పరిధిలోని జలాల్ పూర్ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ముష్టిగొల్ల పల్లవి మోహన్. బాన్సువాడ లోని నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పోచారం భాస్కర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన శ్రీమతి నరేడ్ల మమత బాలు గారికి మద్దతుగా ఈరోజు సర్పంచ్ నామినేషన్ ఉపసరించుకొని పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సంధర్భంగా పార్టీ కండువా కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించిన పోచారం భాస్కర్ రెడ్డి. పాల్గొన్న వర్ని మండల ప్రజాప్రతినిధులు, నాయకులు

## సర్పంచ్ గా గెలిపించండి.. గ్రామాభివృద్ధికి తోడ్పడతాను.దాతర్పల్లి సర్పంచ్ పిట్ల సాయిబాబ ముదీరాజు

మెదక్ జిల్లా, ప్రతినిధి బాలా గౌడ్(శుభోదయం న్యూస్):



మెదక్ జిల్లా తూప్రాన్ మండలం దాతర్పల్లి గ్రామ అభివృద్ధికి తోడ్పడతామని గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నిరంగాల్లో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లి రాష్ట్ర స్థాయిలో ముందుంచుతామని సర్పంచ్ గా పోటీ చేస్తున్న అభ్యర్థి బీసీ సంఘం జిల్లా నాయకులు సమాజ సేవకులు యువజన నాయకులు పిట్ల సాయిబాబ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... గ్రామంలో ఏ సమస్య వచ్చినా ఒక యువజన నాయకుడిగా గ్రామైఖ్య యువజన సంఘాలు సీనియర్ నాయకుల సలహాలు సూచనలు పాటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలేనని పేర్కొన్నారు. అలాంటి గ్రామాల్లో ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి గెలుపొందిన అనంతరం హోదా వచ్చాక గత పాలకులు అభివృద్ధిని విస్మరించారని గుర్తుచేశారు. డిసెంబర్ 14 న జరగబోయే స్థానిక ఎన్నికల్లో గ్రామంలో ఉన్న ప్రతీ ఓటరు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకుని సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను గెలిపించాలని మరోసారి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా పాలనలో ప్రజా సమస్యలకు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ తక్షణ పరిష్కారం





**సన్మానించిన 8 ఇంక్లైన్ కాలనీ మహిళా ప్రజానీకం**
**త్వరలో గోదావరిఖనిలో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు**

రామగుండం మండలం, రిపోర్టర్ (శుభోదయం న్యూస్):

తేదీ:-01-12-2025 సోమవారం రోజున రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలనలో భాగంగా షాది ఖానా ఏర్పాటును స్వాగతిస్తూ మర్యాదపూర్వకంగా మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించిన అనంతరం వారి విజ్ఞప్తి మేరకు త్వరలోనే పండ్ల వర్తకుల సౌకర్యార్థం ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు గురించి సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి తక్షణమే పనులు మొదలు పెట్టాలని ఆదేశించడం జరిగినది. అదే విధంగా 8వ కాలనీ నుండి ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ చేస్తున్న అభివృద్ధి పనులను హర్షిస్తూ వారి సేవలను కొనియాడుతూ కాలనీలో ఇందిరమ్మ కాలనీ స్టాప్ వద్ద బస్సును నిలిపివేయాలని ఎమ్మెల్యేని కోరగా వెంటనే స్పందించి గోదావరిఖని డిపో మేనేజర్ కు మాట్లాడిన సందర్భంలో వెంటనే తక్షణమే మహిళ ప్రయాణికుల ప్రయోజనార్థం ఇందిరా నగర్ కాలనీ వద్ద రిక్వెస్ట్ స్టాఫ్ అమలు చేస్తున్నామని తప్పకుండా బస్సులను ఆపాలనే నిబంధన పాటిస్తామని డిపో మేనేజర్ తెలియజేయడం జరిగినది. అనంతరం హర్షం వ్యక్తం చేసిన 8ఇంక్లైన్ కాలనీ మహిళలు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ని సన్మానించి ఇంతవరకు ఎప్పుడూ ఇటువంటి ఎమ్మెల్యేను చూడలేదని ఏదైనా సమస్య గురించి గతంలో ఉన్న ఎమ్మెల్యేల దగ్గరికి చెప్పులు అరిగేలా తిరిగే వారమని కానీ ప్రస్తుత ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ గారు మమ్మల్ని చెల్లెమ్మ అక్క అనీ కుటుంబ సభ్యురాల్లాగ సంబోధించి మా సమస్యకు పరిష్కారం చూపించడం మేము మరిచిపోలేనిదని కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మహిళలు, ఆడపడుచులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల రక్షణకు పునరుద్ధరణ డిమాండ్

**సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్**

గోదావరిఖని టౌన్, రిపోర్టర్ (శుభోదయం న్యూస్):

దేశంలో అమలు చేస్తున్న నాలుగు కొత్త లేబర్ కోడ్‌లు జర్నలిస్టుల హక్కులను తీవ్రమైన ప్రమాదంలోకి నెట్టాయని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేకంగా అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ 1955, వర్కింగ్ జర్నలిస్ట్స్ వేజ్ యాక్ట్ 1958 వంటి కీలక చట్టాలను రద్దు చేసి, మీడియాను సాధారణ కార్మిక రంగంతో కలిపేయడం అర్థరహితమని, ఇది నాల్గవ స్తంభంపై ప్రత్యక్ష దాడి అని ఆయన వ్యాఖ్యానించారు. కన్నతల్లికి గంజి పెట్టని ప్రభుత్వం.పినతల్లికి బంగారు గాజులు అంటున్నట్టుంది ఈ లేబర్ కోడ్‌లు"గత పదేళ్లుగా కార్మికుల హక్కులపై ఏవిధమైన బలోపేత చర్యలు తీసుకోని కేంద్రం, ఇప్పుడు 29 చట్టాలను రద్దు చేసి కొత్త కోడ్‌లు తీసుకు వచ్చి వాటిని గొప్పగా చూపించుకోవడం నమ్మశక్యం కాదని ఆయన విమర్శించారు. ప్రత్యేకించి మీడియా రంగానికి ఉన్న ప్రత్యేకత, పనిచేసే పరిస్థితులు, ప్రమాదాలు, ఒత్తిళ్లు, భద్రతా సమస్యలను పూర్తిగా పక్కనబెట్టి తీసుకున్న ఈ నిర్ణయం పాత్రికేయుల స్థితిని మరింత దుర్భరంగా మారుస్తుందని మార్షల్ దుర్గం నగేష్ తెలిపారు.ప్రెస్ స్వేచ్ఛ సూచీలో భారత్ 151వ స్థానంలో ఉంది. అయినా మీడియాపై దాడులు కొన సాగుతున్నాయి. భారత దేశం ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీ లో 180 దేశాల్లో 151వ స్థానంలో ఉండటం తీవ్రమైన విషయం అని, ఈ పరిస్థితుల్లో జర్నలిస్టులకు ప్రత్యేక చట్టాలు అవసరం మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు.అయితే అలాంటి సమయంలోనే జర్నలిస్టుల కోసం ఉన్న ప్రత్యేక చట్టాలను కేంద్రం తొలగించడం దురుద్దేశ పూర్వకమని ఆయన అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులపై కేసులు, బెదిరింపులు పెరుగుతున్నా చట్టపరమైన రక్షణ బల హీనంగా మారింది. పూర్తి సమయం పనిచేసే జర్నలిస్టులే కాకుండా ఫ్రీలాన్స్, డిజిటల్, గ్రామీణ పాత్రి కేయులు కూడా తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని మార్షల్ పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో వారికి ప్రత్యేక చట్టపరమైన రక్షణ అత్యవసరమని అన్నారు. జర్నలిస్టు సంఘాల అభి ప్రాయాలు పక్కనబెట్టి కోడ్‌లు అమలు చేయడమే కేంద్రం ఏకపక్ష ధోరణి దేశంలోని ప్రముఖ జర్నలిస్టు సంఘాలను సంప్రదించకుండా కొత్త కోడ్‌లు అమలు చేయడం ప్రజా స్వామ్య వ్యతిరేకమని మార్షల్ దుర్గం నగేష్ అన్నారు.ప్రజా స్వామ్యంలో ప్రధాన శక్తి అయిన మీడియాను కోడ్‌ల పేరిట బలహీనపరచడం అంగీకారయోగ్యం కాదని హెచ్చరించారు. కలం కార్మికుల హక్కులకు ప్రత్యేక చట్టాలు తప్పనిసరి మీడియా రంగంలో పనితీరు, ప్రమాదాలు, వృత్తి పరమైన ఒత్తిడి ఇతర రంగాల కన్నా భిన్నంగా ఉంటాయని, అందువల్ల జర్నలిస్టులకు ప్రత్యేక చట్టాలు కొన సాగించడం కీలకమని ఆయన స్పష్టం



చేశారు.నాల్గవ స్తంభం బలహీనపడితే ప్రజా స్వామ్యమే ప్రమాదంలో పడుతుంది. అందుకే జర్నలిస్టుల హక్కులను రక్షించే ప్రత్యేక చట్టాలు వెంటనే పునరుద్ధరించాలి అని మార్షల్ దుర్గం నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 2.25 కిలోల వెండితో నాగదేవత కవచం ఏర్పాటు






**మాడిపడిగా జ్యువెలరీ అధినేత రమణి ప్రతాప్ కుమార్ చారిని అభినందించిన ఆలయ కమిటీ సభ్యులు**

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్):

శ్రీ వెంకటేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని, మాడిపడిగా జ్యువెలరీ అధినేత ప్రతాప్ కుమార్ చారి అన్నారు. శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ దేవస్థానంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. భక్తులతో పాటు రమణి ప్రతాప్ కుమార్ చారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సత్యమూర్తి మాట్లాడుతూ... 200 వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ దేవస్థానంలో భక్తుల సహకారంతో, ఈ సంవత్సరంలోనే మహా కుంభాభిషేకం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ చారి మాట్లాడుతూ... తమ కుటుంబమంతా స్వామివారికి సేవ చేసుకుంటూ ఉన్నామని, తను చిన్నప్పటినుండి ప్రతివారం ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటామని చెప్పారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా, 100 సంవత్సరాల మడిపడిగ జువెలరీని పురస్కరించుకొని, తనే స్వయంగా తయారుచేసిన నాగదేవత కవచం ( రెండున్నర ) కిలోల కవచాన్ని, ఆలయ ఈవో సత్యమూర్తి, పాలకమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ దేవాలయ ధర్మకర్తలు, ప్రతాప్ కుమార్ చారి కుటుంబ సభ్యులు సుకన్య, వేణుగోపాల్, అరుణ్ కుమార్, ప్రధాన అర్చకులు సారథి స్వామి, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విభేదాలను వీడి అభ్యర్థులను గెలిపించుకుందాం

**హామీలను నిలబెట్టుకొని కాంగ్రెస్ సునీత లక్ష్మారెడ్డి ఎమ్మెల్యే**

మెదక్ జిల్లా, ప్రతినిధి బాలా గౌడ్(శుభోదయం న్యూస్):



ప్రభుత్వ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు.సోమవారం సాయంత్రం వెల్దుర్తి లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులతోసమావేశం నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించి 17 శాతమే ఇచ్చిందని తమ ప్రభుత్వంలో 28 శాతం రిజర్వేషన్ ఇచ్చామని గుర్తు చేశారు.కార్యకర్తలు తనను కష్టపడి ఎమ్మెల్యేగా గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్లువార్డుల అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.ప్రభుత్వం తనుందని అధికార పార్టీ వాళ్లు భయభ్రాంతులకు గురి చేస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు విసుగు చెందారని ఇప్పటికే నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో ఆ పార్టీకి సర్పంచ్ వార్డు మెంబర్ల పోటీకి అభ్యర్థులు దొరకడం లేదన్నారు. అభివృద్ధి పనులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదని రోడ్లపనుల మరమ్మత్తులు నిర్లక్ష్యం వహిస్తుందని మెదక్ నుంచి పిల్లికోటాల్ వెల్దుర్తి మీదుగా అంతారం వరకు 60 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరుకాగా 37 కోట్లతో శివంపేట మండలం పోతుల బోగుడవరకు డబుల్ రోడ్డు పనులు పూర్తయ్యాయని,మెదక్ నుండి వెల్దుర్తి వరకు గల రోడ్డుకు రిబీటీ కోసం పదిహేను కోట్లు వేరువేరుగానిధులు మంజూరుకాగా వాటికి పనుల నిర్వహణకు టెండర్లు జరగడంతో పనులు నిలిచిపోయాయని ఆమె అన్నారు. ఇలాంటి సమస్యలను తీర్చాల్సిన అధికార పార్టీ నాయకులు తాము మంజూరు చేసిన పనులకు అనైతికంగా కొబ్బరికాయలు కొడుతూ ప్రారంభాలు చేస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్నారని ఆమె మండిపడ్డారు.సమావేశంలో రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి మాజీ జెడ్పిటిసిలు రమేష్ గౌడ్ మహేష్ గుప్త మాజీ ఎంపీపీ హరికృష్ణ మండల పార్టీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి రమణ గౌడ్ మోహన్ రెడ్డి నర్సింలు శంకర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాస్ గౌడ్ తోట నరసింహులు పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## సింధూ నాగరికత కనుమరుగు కావడానికి కరువుకాటకాలే ప్రధాన కారణం..

**మిస్టరీని చేధించిన ఐఐటీ గాంధీనగర్‌కు చెందిన పరిశోధకులు**

**హైదరాబాద్ :** ఎంతో అద్భుతంగా విలసిల్లిన సింధూ నాగరికత కాలక్రమేణ కనుమరుగు కావడం అనేది దేశంలోని అతిపెద్ద మిస్టరీల్లో ఒకటని చెప్పవచ్చు. ఈ మిస్టరీని చేధించేందుకు వేల ఏళ్లుగా ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు జరుగుతున్నాయి. కానీ మిస్టరీ మాత్రం మిస్టరీగానే మిగిలిపోయింది. అయితే తాజాగా ఐఐటీ గాంధీనగర్ కు చెందిన పరిశోధకులు ఆ మిస్టరీని చేధించామని చెబుతున్నారు.సింధూ నాగరికత కనుమరుగు కావడానికి కరువుకాటకాలే ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. వరుస కరువులతో జనం బలవంతంగా సింధూ లోయను వదిలి హరప్పా, మొహెంజోదారో, రాఖిగర్హి, లోథాల్ పట్టణ ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. క్రమం తప్పకుండా జరిగిన ఈ వలసలతో చివరికి సింధూ లోయ నాగరికత కనుమరుగైపోయిందని నిర్ధారించారు. ఈ మేరకు వాళ్లు ఒక పరిశోధనా పత్రాన్ని ప్రచురించారు.సింధూ లోయ నాగరికతనే సింధూ-సరస్వతి నాగరికత అని కూడా అంటారు. ఈ నాగరికత క్రీస్తుపూర్వ 5000 ఏళ్ల నుంచి 3500 ఏళ్ల మధ్య విలసిల్లింది. ప్రస్తుతం నైరుతి భారతదేశం, పాకిస్థాన్ దేశాలు ఉన్న ప్రాంతమే ఈ సింధూ నాగరికత ప్రాంతం. ఈ భూప్రపంచంలో పట్టణాలు ఉన్న తొలి నాగరికతగా ఇది గుర్తింపు పొందింది. సింధూ నాగరికత కాలం నాటి నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థ, లోహకళ అబ్బురపరుస్తాయి. ఐదువేల ఏళ్ల క్రితం వారు లోహాలపై డ్యాన్సింగ్ గర్ల్ లాంటి అందమైన బొమ్మలను తీర్చిదిద్దడం ఆశ్చర్యం కలిగిస్తుంది.సింధూ నాగరికత కాలం నాటి నీటి నిర్వహణ వ్యవస్థలు, వ్యాపార వ్యవస్థలు అద్భుతం. అంతటి ఘనమైన సింధూ నాగరికత కనుమరుగు కావడం అనేది పురాతత్వ శాస్త్రవేత్తలకు, చరిత్రకారులకు ఒక ఫజిల్‌గా మిగిలిపోయింది. ఈ క్రమంలో ఐఐటీ గాంధీనగర్‌కు చెందిన విమల్ మిశ్రా నేతృత్వంలో జరిగిన పరిశోధన.. వరుస కరువుకాటకాలే సింధూ నాగరికత కనుమరుగుకు కారణమని తేల్చింది.సింధూ నాగరికత కాలంలో నాలుగు తీవ్రమైన కరువులు ఆ నాగరికతను దెబ్బతీశాయని పరిశోధకులు తెలిపారు. ఆ నాలుగింటిలో ప్రతి కరువు 85 ఏళ్లకు పైగా కొనసాగడం గమనార్హం. వాటిలో ఒక కరువు అత్యంత సుదీర్ఘకాలం కొనసాగింది. దాదాపు 164 ఏళ్లపాటు కొనసాగిన ఆ కరువు దెబ్బకు సింధూ లోయ నాగరికత 91 శాతం తుడిచిపెట్టుకుపోయింది.

## సభలో కూర్చున్నవాళ్లు కరుస్తారని, శునకాలు కాదు: ఎంపీ రేణుకా చౌదరీ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరీ ఇవాళ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శీతాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంట్‌కు వచ్చే క్రమంలో ఓ వీధి కుక్కను తనవెంట తీసుకొచ్చారు. తన కారులో ఆ వీధు శునకాన్ని తెచ్చారు. అయితే కాంగ్రెస్ ఎంపీ డ్రామా ఆడుతున్నట్లు అధికార ఎంపీలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎంపీ రేణుకా చౌదరీ స్పందించారు. సభలో కూర్చున్నవాళ్లు కరుస్తారని, శునకాలు కాదు అని ఆమె అన్నారు. ఓ వీధి కుక్కనువెటర్నరీ క్లినిక్‌కు తీసుకెళ్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రభుత్వానికి జంతువులు అంటే ఇష్టం లేదని, వీధి కుక్కలను రక్షించే చట్టాలు లేవని ఆమె అన్నారు.జంతువులకు స్వరం ఉండదని, ఆ శునకం తన కారులో ఉందని, వాళ్లకు దీనితో సమస్య ఏంటని అన్నారు. అదో చిన్న జంతువు అని, అదేమైనా కరుస్తుందా, పార్లమెంట్ లోపల కూర్చునేవాళ్లు కరుస్తారని, కానీ కుక్కలు కాదన్నారు. కారులో ఉన్న శునకం గురించి ప్రశ్న వేయగా ఆమె స్పందిస్తూ.. ఏ చట్టం ప్రకారం కుక్కలను రక్షించవద్దు అని నిలదీశారు.ఎంపీ రేణుకా చౌదరి ఓ డాగ్ లవర్. ఆమె ఇంట్లో చాలా పెంపుడు జంతువులు ఉన్నాయి. పార్లమెంట్‌లో తనను విడిచిపెట్టిన తర్వాత ఆ శునకాన్ని వెటర్నరీ క్లినిక్‌కు తన డ్రైవర్ తీసుకెళ్లనున్నట్లు ఎంపీ రేణుక తెలిపారు. రేణుక వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. కాంగ్రెస్ ఎంపీ తమాషా చేస్తున్నట్లు బీజేపీ ఎంపీ జగదంబికా పాల్ ఆరోపించారు.పార్లమెంట్‌కు శునకాన్ని తీసుకొచ్చి ఆమె ప్రోటోకాల్‌ను ఉల్లంఘించినట్లు ఆరోపించారు. ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా ఎవర్నీ పార్లమెంట్ లోపలికి తీసుకురావద్దు అని అన్నారు. సభలో చర్చలు నిర్వహించేందుకు ఆసక్తి లేదు కానీ పార్లమెంట్‌లో తమాషా చేస్తున్నారన్నారు.

## రెండో విడత నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట :** నంగూనూరు మండలంలోని పాలమాకుల, బద్దిపడగ క్లస్టర్లలో రెండో విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు పాలమాకుల క్లస్టర్ లో పాలమాకుల, రాజ్ గోపాల్ పేట, ముంద్రాయి మరియు బద్దిపడగ క్లస్టర్ లో బద్దిపడగ, జెపి తండా, దర్గపల్లి గ్రామాల నామినేషన్ లు స్వీకరిస్తున్నట్లు అధికారులు కలెక్టర్ కు తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.జిల్లాలో ఎన్నికల రెండవ దశలో 10 మండలాలు అక్బర్ పేట భూంపల్లి, తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నంగునూరు, చిన్నకోడూరు, నారాయణ రావు పేట్, బెజ్జంకి మండలాల్లో ఈరోజు నుండి మూడు రోజులపాటు నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 వరకు 58 క్లస్టర్ లలో నామినేషన్ లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.



# ఎవరూ ఊహించి ఉండరు..

**మోహన్ లాల్ దృశ్యం 3 థియాట్రికల్, డిజిటల్ రైట్స్ ఎంతో తెలిస్తే షాకవ్వాల్సిందే!**

మాలీవుడ్‌లో తెరకెక్కి.. పలు భాషల్లో విడుదలై టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన చిత్రాల్లో ఒకటి దృశ్యం మలయాళంలో క్రైం థ్రిల్లర్ జోనర్‌లో వచ్చిన ఈ మూవీకి జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించాడు. ఈ ఫ్రాంచైజీలో దృశ్యం 3 కూడా వస్తోన్న విషయం తెలిసిందే. మోహన్ లాల్ మీనా లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా సెట్స్‌పై ఉండగానే ఈ చిత్రం థియాట్రికల్, డిజిటల్ రైట్స్ విషయంలో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. దృశ్యం 3 థ్రియాట్రికల్, డిజిటల్ రైట్స్ కలిపి ఏకంగా రూ.350 కోట్లు పలికాయని మాలీవుడ్ సర్కిల్ సమాచారం. ఇప్పటివరకు ఇదే టాప్ ఫిగర్ కాగా.. మలయాళ ట్రేడ్ ఎనలిస్టులు ఎవరూ కూడా ఊహించని విధంగా రికార్డు స్థాయిలో రైట్స్ అమ్ముడుపోయి అరుదైన ఫీట్ నమోదు చేసింది దృశ్యం 3. జార్జ్‌కుట్టీ (మోహన్ లాల్ పాత్ర) ఫ్యామిలీ చుట్టూ తిరిగే కథతో తెరకెక్కిన దశ్యం ఫ్రాంచైజీలో వచ్చిన రెండు పార్టులు ఇప్పటికే బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. ఆశీర్వాద్ సినిమాస్ దశ్యం 3ని తెరకెక్కిస్తోంది. మరి మూడో పార్టు బాక్సాఫీస్‌ను ఏ స్థాయిలో షేక్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. దృశ్యం కథ తెలుగు, తమిళం, హిందీతోపాటు వివిధ భాషల ప్రేక్షకులకు కూడా బాగా కనెక్ట్ అయిందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే తెలుగులో వెంకటేశ్, హిందీ, తమిళం, కన్నడ భాషల్లో రీమేక్ అయి సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది.

## ఓటీటీలో వరుణ్ సందేశ్ ఎంట్రీ.. వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



కొత్తబంగారు లోకం హీరో వరుణ్ సందేశ్ ఓటీటీలో ఎంట్రీ ఇస్తున్నాడు. ఇతడు ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ వెబ్ సిరీస్ 'నయనం'. ఈ సిరీస్ జీ5లో డిసెంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సైకో థ్రిల్లర్‌ను స్వాతి ప్రకాశ్ డైరెక్ట్ చేశారు. మనుషుల్లోని నిజ స్వభావానికి, ఏదో కావాలని తపించే తత్వానికి మధ్య ఉండే సున్నితమైన అంశాలను ఇందులో చూపించారు. సోమవారంనాడు ఈ సిరీస్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. డాక్టర్ నయన్ పాత్రలో వరుణ్ సందేశ్ కనిపించనున్నాడు. తన పాత్రలోని డార్క్ యాంగిల్, సైకలాజికల్ సంక్లిష్టతను ఇందులో ఆవిష్కరించారు. ఈ వెబ్ సిరీస్‌లో ఆరు ఎపిసోడ్స్ ఉండనున్నాయి. ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తోన్న వరుణ్ సందేశ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నటుడిగా నాకు ఇది సరికొత్త ప్రయాణం. ఇప్పటి వరకు చేయనటువంటి విభిన్నమైన పాత్రలో డాక్టర్ నయన్‌గా కనిపించబోతున్నాను. పోస్టర్ గమనిస్తే నా పాత్రలో ఇంటెన్సిటీ అర్థమవుతుంది. ఓటీటీలో యాక్ట్ చేయటం వల్ల ఇలాంటి పాత్రలో డెప్త్‌ను మరింతగా ఎలివేట్ చేసినట్లయింది అని పేర్కొన్నాడు.



# తమన్నా చేతికి మరో బిగ్ ఆఫర్

## ఆ బయోపిక్‌లో కీలక పాత్ర!

నటి తమన్నా భాటియా వరుసగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విభిన్నమైన పాత్రలతో జోరు మీద ఉన్నారు. ఇటీవల ఓదెలా 2లో శక్తివంతమైన పాత్రతో, అలాగే అజయ్ దేవగన్ నటించిన రైడ్ 2లో ఆకట్టుకునే రోల్‌తో ప్రేక్షకులను మెప్పించిన ఆమెకు ఇప్పుడు మరో బిగ్ ఆఫర్ వచ్చినట్టు చిత్ర పరిశ్రమలో టాక్ నడుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ..వీ. శాంతారాం జీవితకథ ఆధారంగా బయోపిక్ రూపొందించనుండగా, అందులో తమన్నా ఒక ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. అందులో ఆమె, శాంతారం భార్య అయిన ప్రముఖ నటి సాంధ్య పాత్రను పోషించనున్నట్లు చెప్పుకుంటున్నారు. హిందీ, మరాఠీ సినిమాల్లో సాంధ్య ఓ ప్రముఖ నటి. వీ. శాంతారాం దర్శకత్వంలో ఆమె నటించిన అనేక చిత్రాలు అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి. అందువల్ల సాంధ్య పాత్ర ఈ బయోపిక్‌లో అత్యంత ప్రాధాన్యమైనదిగా భావిస్తున్నారు. ఈ బయోపిక్‌కు "చిత్రపతి వీ. శాంతారాం" అనే టైటిల్ ఖరారు చేసినట్లు సమాచారం. బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది వీ. శాంతారాం పాత్రలో నటించనున్నాడు. ఆయన కెరీర్‌లో ఇది భిన్నమైన, ప్రతిష్టాత్మక పాత్ర అవుతుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. ఈ చిత్రాన్ని 'నాటసామ్రాట్' సినిమాతో ప్రశంసలు అందుకున్న దర్శకుడు అభిజిత్ దేశ్‌పాండే తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలు, పాత్రల లోతును చూపడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం దృష్ట్యా ఈ సినిమా కూడా ప్రత్యేకంగా నిలవొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథ విన్న వెంటనే తమన్నా ఈ పాత్రపై ఆసక్తి చూపి అంగీకరించినట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా పాత్రలు ఎంపికకి కొత్త ప్రాధాన్యం ఇస్తున్న ఆమెకి, ఈ పాత్ర మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని సమాచారం. సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభకానుంది. వీ. శాంతారాం సినీరంగానికి చేసిన సేవలు, ఆయన వినూత్న ప్రయోగాలు, వ్యక్తిగత జీవితం ఇలా ఎన్నో అంశాలను ఈ బయోపిక్‌లో చూపించనున్నారు.ఈ చిత్రం బాలీవుడ్‌లో మరో ప్రతిష్టాత్మక బయోపిక్‌గా నిలుస్తుందని, అలాగే తమన్నా నటనకు కొత్త మైలురాయి అవుతుందని అభిమానులు, ఫిల్మ్ సర్కిల్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

# మొన్న ధనుష్.. ఇప్పుడు అయ్యర్.. నెక్ట్స్ ఎవరు?



'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మృణాల్ ఠాకుర్.. తర్వాత టాలీవుడ్‌లో మరో రెండు సినిమాలు చేసింది. అనంతరం పూర్తిగా హిందీపై ఫోకస్ పెట్టింది. ఎప్పటికప్పుడు ఏదోలా సోషల్ మీడియాలో ఈమె గురించి చర్చ నడుస్తూనే ఉంటుంది. తాజాగా ఈమె.. టీమిండియా క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌తో డేటింగ్‌లో ఉందనే రూమర్స్ వచ్చాయి. ఇవి మృణాల్ వరకు చేరడంతో క్లారిటీ ఇచ్చింది. 'ఇలాంటి రూమర్స్ వినడానికి చాలా కామెడీగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఉచితంగా చేసే పీఆర్ స్టంట్స్ ఇవి' అని మృణాల్ తనపై వస్తున్న డేటింగ్ వార్తల్ని కొట్టిపారేసింది. గతంలో తమిళ హీరో ధనుష్‌తోనూ ఈమె డేటింగ్ చేస్తుందనే వార్తలు రాగా.. అతడు తన స్నేహితుడు మాత్రమేనని చెప్పుకొచ్చింది. మరి నెక్ట్స్ ఏ సెలబ్రిటీతో మృణాల్ డేటింగ్ అని వార్తలొస్తాయో చూడాలి? ఈ ఏడాది హిందీలో పలు చిత్రాలతో వచ్చిన మృణాల్.. వచ్చే ఏడాది తెలుగు, హిందీ మూవీస్‌తో రాబోతుంది. అడివి శేష్ 'డకాయిట్'లో ఈమె హీరోయిన్‌గా చేస్తోంది. ఇది వచ్చే ఏడాది మార్చిలో రానుందని ఇదివరకే ప్రకటించారు. అలానే అల్లు అర్జున్-అట్లీ కాంబోలో తీస్తున్న సినిమాలోనూ ఈమె ఒక హీరోయిన్ అని అంటున్నారు. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదు.

# స్పిరిట్ కోసం సందీప్ సరికొత్త స్కెచ్.. కరీనా ప్లేస్‌లో గ్లామర్ డాల్‌ని దింపుతున్నాడా?




'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి ట్రెండ్ సెట్టింగ్ చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్'పై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది. వివేక్ ఒబెరాయ్ ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించబోతున్నారు. ఈ చిత్రంలో కీలకమైన నెగటివ్ షేడ్స్ ఉన్న ఓ ముఖ్యమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ కాజోల్‌ను సంప్రదించినట్టు సమాచారం. మొదట ఈ పాత్రను బాలీవుడ్ స్టార్ కరీనా కపూర్ ఖాన్ చేయాల్సి ఉన్నా, కొన్ని కారణాల వల్ల ఆమె 'స్పిరిట్' నుంచి తప్పుకున్నారని టాక్. దాంతో ప్రత్యామ్నాయంగా కాజోల్‌ను తీసుకోవాలని చిత్రబృందం భావించినట్టు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. 1992లో 'బెఖుడి' ద్వారా బాలీవుడ్ లోకి అడుగుపెట్టిన కాజోల్, దక్షిణాది భాషల్లో చాలా అరుదుగానే నటించింది. ధనుష్‌తో నటించిన 'వి ఐ పి 2' లో విలన్ పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ఇప్పుడు 'స్పిరిట్' ద్వారా ఆమెకు టాలీవుడ్‌కి రీఎంట్రీ ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. త్వరలోనే దీనిపై క్లారిటీ రానుంది. ఇక 'స్పిరిట్' షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కీలక సన్నివేశాల్లో ప్రభాస్ పాల్గొన్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. తన కెరీర్‌లో మొదటిసారిగా ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నందున అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. కొత్త లుక్, కొత్త బాడీ లాంగ్వేజ్‌తో ప్రభాస్ కనిపించబోతున్నారని సమాచారం. గత కొన్ని నెలలుగా సౌత్ కొరియా యాక్షన్ స్టార్ డాన్ లీ ('షాంగ్-చీ' ఫేమ్) 'స్పిరిట్'లో నటించబోతున్నాడనే వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. అభిమానులు దీనిపై క్లారిటీ కోరుతున్నా, సందీప్ రెడ్డి వంగా ఈ వార్తపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే అంతర్జాతీయ నటీనటులు ఉంటారని మాత్రం టాక్ వినిపిస్తుంది. 'స్పిరిట్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి హాజరవడం పెద్ద చర్చకు దారి తీసింది. దీంతో ఆయన కూడా సినిమాలో ఒక కీలక అతిథి పాత్రలో కనిపించే అవకాశం ఉందని రూమర్స్ వస్తున్నాయి. ప్రభాస్ తండ్రి పాత్రలో చిరంజీవి నటిస్తున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నా, దీనిపై పూర్తి క్లారిటీ లేదు.